

వణికించిన మొంథా

మంగినపూడి బీచ్‌లో ఉధృతంగా వస్తున్న అలలు



సముద్ర తీరంలో అలజడి

మంగినపూడి బీచ్‌లో ఎగసిపడుతున్న అలలు



మంగినపూడి బీచ్‌లో పర్యటిస్తున్న మంత్రులు సుభాష్, రవీంద్ర, ఆర్టీసీ చైర్మన్ నారాయణ

- భారీగా వీస్తున్న ఈదురు గాలులు
- తీరం దాటే సమయంలో మరింత తీవ్రంగా ఉంటాయని హెచ్చరికలు
- జిల్లా వ్యాప్తంగా భారీ వర్షం
- 165 పునరావాస కేంద్రాలు ఏర్పాటు
- లోతట్టు ప్రాంతాల్లోని 6,618 మంది తరలింపు
- పునరావాస కేంద్రాలను సందర్శించిన మంత్రులు సుభాష్, రవీంద్ర

(ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం): మొంథా తుపాను ప్రభావంతో సముద్రంలో తీవ్ర అలజడి నెలకొంది. జిల్లాలోని 111 కిలోమీటర్ల సముద్ర తీరం వెంబడి అలలు ఉవ్వెత్తున ఎగిసిపడుతున్నాయి. మంగినపూడి, హంసలదీవి బీచ్‌ల వద్ద భయానక వాతావరణం ఏర్పడింది. సముద్ర తీరంలోకి ఎవరూ వెళ్లకుండా మెరైన్, పోలీసులు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. ఒకవైపు సముద్రపు అలలు, మరోవైపు బలమైన గాలులతో కూడిన వర్షంతో బీచ్‌ల వద్ద ఏం జరుగుతుందో తెలియని స్థితి నెలకొంది. పెను తుపాను మచిలీపట్నానికి మిగతా 6లో..



మచిలీపట్నం తహసీల్దార్ కార్యాలయం వద్ద కూలిన చెట్టు



పెడన మండలం నందమూరులో నీటిలో వరి కంకులు

అధికారులతో సమీక్ష

కలెక్టరేట్‌లోని మినీ సమావేశపు హాలులో తుపాను జిల్లా ప్రత్యేక అధికారి ఆమ్రపాలి, కలెక్టర్ బాలాజీ, జేసీ ఎం.నవీన్ తదితరులతో మంత్రి కొల్లు రవీంద్ర, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ రావు సమీక్ష నిర్వహించారు. తుపాను తీరం దాటే సమయంలో ప్రజలు ఇబ్బందులు పడకుండా సురక్షిత ప్రాంతాలకు తరలించాలని తెలిపారు. ప్రత్యేక అధికారి ఆమ్రపాలి మాట్లాడుతూ ఇప్పటికే లోతట్టు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించినట్టు చెప్పారు. కలెక్టర్ బాలాజీ మాట్లాడుతూ 165 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. 6,618 మందిని పునరావాస కేంద్రాలకు చేర్చామని వివరించారు.

మొంథా తుఫాను జిల్లా ప్రజలను వణికిస్తోంది. సముద్ర తీరంలో మంగళవారం తీవ్ర అలజడి రేగింది. మంగినపూడి బీచ్‌లో అలలు ఎగసిపడుతున్నాయి. భారీగా వీస్తున్న ఈదురు గాలులతో వరి పొలాలు నేలవాలాయి. తుఫాను తీరం దాటే సమయంలో మరింత ఉధృతంగా వీస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలు ఆందోళన కలిగిస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా భారీ వర్షం కురిసింది. 165 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసిన అధికారులు లోతట్టు ప్రాంతాల్లోని 6,618 మందిని శిబిరాలకు తరలించారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి వాసంశెట్టి సుభాష్, మంత్రి కొల్లు రవీంద్ర, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు పునరావాస కేంద్రాలను సందర్శించి సౌకర్యాలపై ఆరా తీశారు. తుఫాను ముప్పును ఎదుర్కొనేందుకు పటిష్ఠ చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులకు సూచించారు.

చకచకా రేషన్

ఉమ్మడి జిల్లాలో డిపోలకు బియ్యం, పంచదార సరఫరా

- లబ్ధిదారులకు పంపిణీ ప్రారంభించిన డీలర్లు
- మధ్యాహ్నానికి 40 శాతం డోర్ డెలివరీ పూర్తి
- అదనంగా గ్యాస్ సిలిండర్లను సిద్ధం చేయాలని ఏజెన్సీలకు ఆదేశాలు
- డీజిల్, పెట్రోల్ నిల్వలు పెంచాలని బంకుల నిర్వాహకులకు సూచన



నిత్యావసరాలు డోర్ డెలివరీ చేస్తున్న డీలర్

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): మొంథా తుఫాను నేపథ్యంలో ఉమ్మడి కృష్ణాజిల్లాలో ముందస్తుగా పౌరసరఫరాల శాఖ అధికారులు నిత్యావసరాల పంపిణీ చేపట్టారు. ఎన్టీఆర్, కృష్ణాజిల్లాల్లో చౌక దుకాణాలకు బియ్యం, పంచదార సరఫరా చేశారు. ఎన్టీఆర్ జిల్లాలో 957 డిపోలకు మొత్తం 4,298 మెట్రిక్ టన్నుల బియ్యం, 134 మెట్రిక్ టన్నుల పంచదార తరలించారు. విజయవాడ నగరం, జిల్లా వ్యాప్తంగా నిత్యావసరాల పంపిణీ ప్రారంభించారు. 65 సంవత్సరాల పైబడిన వారికి ఇంటికే నిత్యావసరాలు డోర్ డెలివరీ చేస్తున్నారు. మధ్యాహ్నానికి 40 శాతం మేర డోర్ డెలివరీ పూర్తి చేశారు. కృష్ణా జిల్లాలో 1,059 రేషన్ డిపోలకు పూర్తిగా మిగతా 6లో..

పోలీస్ కమిషనరేట్ విడుదల చేసిన బుడమేరు వాగు డ్రోన్ చిత్రం



బుడమేరు వరద అపోహలు నమ్మొద్దు

పోలీస్ కమిషనర్ రాజశేఖరబాబు

విజయవాడ సిటీ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపాను ప్రభావంతో కురిసే వర్షాలకు బుడమేరు పొంగుతుందని జరిగే అసత్య ప్రచారాన్ని నమ్మొద్దని జిల్లా ప్రజలకు పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు సూచించారు. ప్రజలను భయభ్రాంతులకు గురి చేసేందుకు కొన్ని అసాంఘిక శక్తులు పనికట్టుకని దుష్ప్రచారాన్ని చేస్తున్నాయని తెలిపారు. బుడమేరు వాస్తవ ప్రత్యక్ష ప్రవాహ దృశ్యాన్ని డ్రోన్‌ల సాయంతో చిత్రీకరించి సదరు ఫొటోలను మంగళవారం ఆయన మీడియాకు విడుదల చేశారు. జిల్లా పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మున్నేరు, బుడమేరు, కట్టలేరు, వైరా తదితర వాగులను అన్నింటినీ నిత్యం పర్యవేక్షిస్తున్నామన్నారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి డ్రోన్‌ల సాయంతో వాగులను పరిశీలిస్తున్నామని తెలిపారు. వాగుల పరిస్థితిని ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ, సంబంధిత సమాచారాన్ని కంట్రోల్ రూంలకు చేరవేస్తున్నామన్నారు. వాగుల్లో నీటి ప్రవాహ స్థితిని నిశితంగా గమనిస్తున్నామని చెప్పారు. ప్రస్తుతానికి వాగుల్లో ప్రమాదకర పరిస్థితులు ఏమీ లేవని స్పష్టం చేశారు. ఏదైనా ప్రమాదకర పరిస్థితులు తలెత్తితే ప్రజలకు వెంటనే తెలియజేస్తామన్నారు. బుడమేరుపై జరుగుతున్న ఫేక్ ప్రచారాన్ని నమ్మొద్దన్నారు.

అద్విక ఆదిత్య అరెస్టు

పెట్టుబడులుగా రూ.413.03 కోట్లు వసూలు

- మొత్తం పెట్టుబడుదారులు 1,417
- రూ. 144 కోట్లకు టోకరా
- వివరాలు వెల్లడించిన సీపీ రాజశేఖరబాబు

పెట్టుబడిగా లక్ష రూపాయలు పెడితే నెలకు రూ. 6 వేలు వడ్డీగా చెల్లిస్తానని చెప్పి ప్రజల నుంచి కోట్లాది రూపాయలు వసూలు చేసి బోర్డు తిప్పేసిన అద్విక ట్రేడింగ్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ ఎండీ తాడేపల్లి శ్రీవెంకట ఆదిత్యను విజయవాడ పోలీసులు అరెస్టు చేశారు. అతడితోపాటు భార్య సుజాత, మరో ఇద్దరు ఏజెంట్లు విజయవాడ లబ్బీపేటకు చెందిన గాదంశెట్టి బాలకృష్ణమూర్తి, ఆయన సతీమణి నాగలక్ష్మీదేవికి సంకెళ్లు వేశారు. వివరాలను పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు, డీసీపీలు కేజీవీ సరిత, తిరుమలేశ్వరరెడ్డి, ఏడీసీపీ ఎం.రాజారావు, ఏసీపీలు లతాకుమారి, కె.దామోదరరావు, ఇన్‌స్పెక్టర్లు ప్రకాష్, సుబ్రహ్మణ్యంతో కలిసి కమిషనర్ కార్యాలయంలోని సమావేశపు హాలులో మంగళవారం వెల్లడించారు.



అద్విక యజమానుల నుంచి స్వాధీనం చేసుకున్న నగదు, బంగారం, వెండి వస్తువులను ప్రదర్శిస్తున్న సీపీ రాజశేఖరబాబు

విజయవాడ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఎక్కువ వడ్డీ చెల్లిస్తామని ప్రజలకు ఆశలు పుట్టించి ఆదిత్య రూ.413.03 కోట్లను పెట్టుబడులుగా వసూలు చేశాడు. ఏజెంట్లు, ఖాతాదారులు వెరసి 1,417 మంది ఇందులో పెట్టుబడులు పెట్టారు. 2022లో ఆదిత్య, అతని భార్య సుజాత విజయవాడలో అద్విక ట్రేడింగ్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ ఏర్పాటు చేశారు. వారు తొలుత రూ.15 లక్షల పెట్టుబడితో దుబాయిలోని కబానా అకౌంట్ ద్వారా ఫారెక్స్ ట్రేడింగ్ ప్రారంభించారు. అద్విక ప్రారంభించిన కొత్తలో లాభాలు పెద్దగా రాకపోవడంతో ఆదిత్య, సుజాత కలిసి పెట్టుబడులను ఆకర్షించడానికి ప్రణాళిక రూపొందించారు. సుజాతకు ప్రైవేటు బ్యాంకులో రికవరీ మేనేజర్‌గా ఉద్యోగం చేసిన అనుభవం ఉండడంతో తమ సంస్థలో పెట్టుబడి పెట్టిన వారికి నెలకు ఆరు శాతం, ఏజెంట్లకు మూడు నుంచి మిగతా 6లో..

నిందితులకు రిమాండ్

అద్విక ట్రేడింగ్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ ఎండీ తాడేపల్లి శ్రీవెంకట ఆదిత్యతోపాటు మరో ముగ్గురికి న్యాయస్థానం రిమాండ్ విధించింది. ఆదిత్య, ఆయన భార్య సుజాత, ఏజెంట్లు గాదంశెట్టి బాలమురళీకృష్ణ, ఆయన సతీమణి నాగలక్ష్మీదేవిని పోలీసులు అరెస్టు చేసి మంగళవారం రాత్రి విజయవాడ మొదటి అదనపు చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచారు. వారికి కోర్టు వచ్చే నెల పదో తేదీ వరకు రిమాండ్ విధించింది. అనంతరం నిందితులను విజయవాడ జిల్లా జైలుకు తరలించారు.

సత్యదేవుడి సన్నిధిలో డీఎస్పీల జంట



సత్యదేవుని సన్నిధిలో అవనిగడ్డ, గురజాల డీఎస్పీలు విద్యశ్రీ, జగదీష్

అన్నవరం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఇద్దరు డీఎస్పీలు ప్రేమించి పశ్చిమ గోదావరి జిల్లాలో ఒక్కటైన జంట మంగళవారం కాకినాడ జిల్లా అన్నవరం సత్యదేవుడి సన్నిధిలో వ్రతమాచరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రస్తుతం కృష్ణాజిల్లా అవనిగడ్డ డీఎస్పీగా పని చేస్తున్న విద్యశ్రీ, పల్నాడు జిల్లా గురజాల డీఎస్పీగా పని చేస్తున్న జగదీష్‌లు గత కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. ఇరుపెద్దల అంగీకారంతో వారు ఒక్కటయ్యారు. వారికి ఆలయ అధికారులు ఏర్పాట్లు చేయగా దర్శనం అనంతరం వేదపండితులు వేదాశీర్వచనాలు అందజేశారు. ఒకే క్యాడర్ గల పోలీస్ అధికారుల ప్రేమవివాహం విశేషంగా మారింది.

తాడేపల్లి డైరెక్షన్‌లోనే.. జోగి ప్రమాణాల డ్రామా

- పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ 6

కమ్యూనికేషన్స్ అలెర్ట్!

నాటి బుడమేరు పరిస్థితులను పునరావృతం కానీయొద్దు

- సమాచార వ్యవస్థ లేక ఆకలితో అలమటించిన బాధితులు
- గత అనుభవాలతో పక్కా ప్రణాళిక అవసరం
- టెలికాం నెట్‌వర్క్, సెల్ టవర్స్, పవర్ బ్యాకప్‌పై దృష్టి సారించాలి



(ఆంధ్రజ్యోతి, విజయవాడ): మొంథా తుఫాను నేపథ్యంలో కమ్యూనికేషన్ వ్యవస్థలను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. వీటిని విఘాతం ఏర్పడితే విపత్తులో బాధితులకు సహాయక చర్యలు అందించలేని పరిస్థితి ఏర్పడుతుంది. ఈ విషయం గత బుడమేరు వరదల సమయంలో తేటతెల్లమైంది. మళ్లీ అటువంటివి పునరావృతం కాకుండా ప్రస్తుత తుఫాను నేపథ్యంలో మన కమ్యూనికేషన్ వ్యవస్థలను కాపాడుకోవటం చాలా ముఖ్యం. జిల్లా అధికార యంత్రాంగంతో పాటు ప్రైవేటు కంపెనీలు, ప్రజలు కూడా ఇలాంటి సమయాల్లో సీరియస్‌గా దృష్టి సారించాల్సి ఉంది. ప్రభుత్వ పరంగా చూస్తే టెలికాం టవర్లు, ట్రాన్స్‌మిషన్ లైన్లపై నిరంతర పర్యవేక్షణ అవసరం. కీలకమైన టెలికాం టవర్లను ముందుగానే గుర్తించి అవి కూలకుండా ఉండటానికి, బలోపేతం చేయటానికి తగిన చర్యలు తీసుకోవాల్సి ఉంది. టెలికాం టవర్లలో బీఎస్ఎన్ఎల్ ఒక్కటే ప్రభుత్వ రంగానికి చెందింది. జీయో, ఎయిర్ టెల్, వీఐ వంటి టెలికాం కంపెనీల టవర్లు ఉన్నాయి. ఈ కంపెనీల జిల్లా హెడ్స్‌తో అత్యవసరంగా సమావేశం నిర్వహించి వారి ద్వారా టవర్ల బలోపేతానికి చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. ఇదే సందర్భంలో పవర్ బ్యాకప్ సిస్టమ్‌పై కూడా దృష్టి అవసరం. సెల్ టవర్లు, కమ్యూనికేషన్ సెంటర్లలో పవర్ బ్యాకప్ సిస్టమ్ అనేది చాలా ముఖ్యం. పవర్ బ్యాకప్ లేకపోతే అవి పని చేయవు. సిగ్నల్స్‌ను వ్యాప్తి చేయలేవు. అప్పుడు ఫోన్లకు సిగ్నల్స్ ఆగిపోతాయి. పవర్ బ్యాకప్‌ను 72 - 96 గంటల వరకు ఉండేలా యూపీఎస్‌లను, డీజిల్ జనరేటర్లను సిద్ధం చేసుకోవాల్సిన అవసరం ఉంది. ఆ దిశగా ఆయా టెలికాం కంపెనీ హెడ్‌లతో చర్చించాల్సిన అవసరం ఉంది. అతి భారీ వర్షాలు కురిస్తే ఫ్లాష్ ఫ్లడ్స్ వచ్చే ప్రమాదం ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో జలనిరోధక కేబుల్ సిస్టమ్స్‌ను ఏర్పాటు చేసే అంశాలపైనా దృష్టి సారించడం అవసరం. ఒకవేళ ప్రధాన టెలికాం నెట్‌వర్క్ దెబ్బతింటే మొబైల్ నెట్‌వర్క్‌ను త్వరితగతిన ఏర్పాటు చేసే చర్యలు తీసుకోవాల్సి ఉంది. ఇంటర్నెట్ చాలా అవసరం. ఇంటర్నెట్ సేవలకు విఘాతం వాటిల్లితే ప్రస్తుతం జరిగే నష్టం అంతా, ఇంతా కాదు. ఇలాంటపుడు ఇన్‌బిల్ట్ శాటిలైట్ ఇంటర్నెట్ బ్యాకప్ ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఉంటుంది. అధికార యంత్రాంగాలు అత్యవసర కమ్యూనికేషన్ కోసం వాకీటాకీలు, శాటిలైట్ ఫోన్స్ వంటివి తగిన సంఖ్యలో అందుబాటులో ఉంచుకోవాలి.

అప్రమత్తత అవసరం

తుఫాన్ల సమయంలో ప్రజలు కూడా కమ్యూనికేషన్స్ వ్యవస్థల విషయంలో అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. పవర్ బ్యాకప్ ఏర్పాట్లు చేసుకోవాల్సి ఉంది. ప్రధానంగా పవర్ బ్యాంకులు, ల్యాప్‌టాప్‌లు, స్మార్ట్‌ఫోన్‌లు నూరు శాతం చార్జింగ్‌తో అంటిపెట్టుకోవాలి. అందుబాటులో ఉన్న బ్యాటరీలను, యూపీఎస్‌లను చార్జింగ్ చేసుకోవాల్సిన అవసరం ఉంది. ఒకవేళ విద్యుత్ లేకపోతే కారు, బైక్ చార్జర్ల ద్వారా కూడా చార్జింగ్ చేసుకునే అవకాశాలను ఉపయోగించుకోవచ్చు. ఏదైనా ప్రాంతం ప్రభావితం అవుతుందనుకుంటే.. ఆ ప్రాంత ప్రజలంతా వీలైనంత వరకు వాట్సాప్, టెలిగ్రామ్ వంటి గ్రూపులను ఏర్పాటు చేసుకోవచ్చు. అత్యవసర పరిస్థితులలో కమ్యూనికేషన్ కోసం ఇవి దోహద పడతాయి. అలాగే ఎక్స్, ఫేస్‌బుక్‌లను కూడా ఉపయోగించుకోవచ్చు.



దుర్గగుడి మూసివేత

ఇంద్రకీలాద్రి: మొంథా తుఫాను ప్రభావం.. దేవస్థానం అధికారులు, పాలకమండలి సభ్యుల సూచన మేరకు ఆలయ అర్చక, ఉద్యోగులు నిర్ణీత సమయానికంటే ముందే ఆలయాన్ని మంగళవారం రాత్రి 8 గంటలకు మూసివేశారు. తుఫాను ప్రభావంతో రాష్ట్ర వ్యాప్తంగా కురుస్తున్న వర్షాల కారణంగా భక్తుల తాకిడి తక్కువగా ఉండటంతో పాటు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు ముందస్తుగా ఆలయాన్ని మూసివేసినట్టు అధికారులు పేర్కొన్నారు. మంగళవారం ఉదయం నుంచి భక్తులు అంతంత మాత్రంగా ఉండటంతో సాయంత్రం ఆలయ పరిసరాలు నిర్మానుష్యంగా మారాయి. ఆలయాన్ని రాత్రి 8 గంటలకు మూసివేయాలన్న ఈవో వీకే శీనానాయక్, చైర్మన్ బొర్రా రాధాకృష్ణ ఆదేశాల మేరకు అర్చకులు, అధికారులు ఆలయాన్ని మూసివేశారు. బుధవారం ఉదయం యధావిధిగా అమ్మవారి దర్శనం ఉంటుందని అధికారులు తెలిపారు.



సీఎం కార్యాలయ కార్యదర్శి ప్రద్యుమ్నకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఈవో శీనానాయక్

కనకదుర్గమ్మను దర్శించుకున్న ప్రద్యుమ్న

ఇంద్రకీలాద్రి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రి, దుర్గామల్లేశ్వర దేవస్థానంలో కనకదుర్గమ్మను మంగళవారం ముఖ్యమంత్రి కార్యాలయ కార్యదర్శి ప్రద్యుమ్న సతీసమేతంగా కుటుంబసభ్యులతో కలిసి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయనకు ఈవో వీకే శీనానాయక్, అర్చకస్వాములు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనానంతరం వారికి వేద ఆశీర్వచనం అనంతరం అమ్మవారి చిత్రపటం, లడ్డూ ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు.

సీఎం చంద్రబాబుతో విష్ణువర్ధన్‌రెడ్డి భేటీ



వన్‌టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబును భారతీయ జనతా పార్టీ జాతీయ కమిటీ సభ్యుడు ఎస్.విష్ణువర్ధన్‌రెడ్డి అమరావతిలోని సచివాలయంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా దేశంలో అతిపెద్ద ఐటీ విదేశీ పెట్టుబడులు గూగుల్ సంస్థ నుంచి విశాఖకు రావడం అభినందనీయమని పేర్కొన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, అమరావతిలో నిర్మాణాలు వేగవంతం కావడంపై ముఖ్యమంత్రిని అభినందించినట్టు ఈ సందర్భంగా విష్ణువర్ధన్ రెడ్డి మీడియాతో పేర్కొన్నారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు పనతాల సురేష్, బీజేపీ మీడియా ప్రతినిధి చిన్నపరెడ్డి రవీంద్రరెడ్డి తదితరులు ఉన్నారు.

విమానాశ్రయం కస్టమ్స్ గదిలో మంటలు

» ఫైర్ సిబ్బంది అప్రమత్తతతో తప్పిన ప్రమాదం

గన్నవరం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : గన్నవరం విమానాశ్రయంలోని అంతర్జాతీయ టెర్మినల్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు ఎగిసిపడిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. అంతర్జాతీయ టెర్మినల్లోని కస్టమ్స్ అధికారుల గదిలో స్విచ్ బోర్డ్ వద్ద మంటలు వ్యాపించాయి. అక్కడ ఉన్న వస్త్రాలకు మంటలు అంటుకుని దట్టమైన పొగలు అలముకున్నాయి. భద్రతా సిబ్బంది సమాచారం మేరకు అక్కడికి చేరుకున్న అగ్నిమాపక బృందం మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ప్రమాదంలో ఎటువంటి ఆస్తినష్టం సంభవించలేదని, ఎవరికి గాయాలు కాలేదని డైరెక్టర్ ఎం.లక్ష్మీకాంత రెడ్డి తెలిపారు. షార్ట్ సర్క్యూట్ కారణంగానే ప్రమాదం జరిగి ఉంటుందని అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

తాడేపల్లి డైరెక్షన్‌లోనే.. జోగి ప్రమాణాల డ్రామా

» పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్

వన్‌టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : తాడేపల్లి డైరెక్షన్‌లోనే ప్రమాణాల పేరుతో కొత్త నాటకానికి జోగి రమేశ్ తెరతీశాడని, నిస్సిగ్గుగా అబద్ధాలు ఆడుతూ నీచ రాజకీయాల కోసం సొంత కుటుంబసభ్యులను కూడా రోడ్డుపైకి తీసుకొచ్చిన వ్యక్తిత్వం ఆయనకే చెల్లిందని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ విమర్శించారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు చూసి ఓర్వలేక జోగి ప్రమాణాల పేరుతో కొత్త డ్రామా మొదలుపెట్టారని ఆరోపించారు. ఈ సందర్భంగా ఆయన మంగళవారం ఓ వీడియో విడుదల చేశారు. చంద్రబాబు ఇంటిపై దాడిచేసి దొడ్డిదారిలో మంత్రి పదవి తెచ్చుకున్న జోగి వ్యక్తిత్వం గురించి చెప్పనక్కర్లేదన్నారు. నకిలీ మద్యం కేసులో సాక్ష్యాలతో సహా జోగి దొరికిపోయాడని.. ఎన్ని ప్రమాణాలు చేసినా నిందితులకు శిక్ష తప్పదన్నారు.

కొండవీటి వాగు ప్రాంతాలను

పరిశీలించిన ఏడీసీ బృందం

కలెక్టరేట్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాను ప్రభావంతో ఎగువ నుంచి కొండవీటి వాగుకు వరద నీటి తాకిడి వున్నందున అమరావతి అభివృద్ధి సంస్థ (ఏడీసీ) ఛైర్‌పర్సన్, మేనేజింగ్ డైరక్టర్ డి.లక్ష్మీపార్థసారధి మంగళవారం కొండవీటి వాగు పరివాహక ప్రాంతాలను ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఎగువ నుంచి కొండవీటి వాగులో నీటి ఉధృతి పెరిగే క్రమంలో ప్రవాహానికి ఎక్కడా అంతరాయం కలుగకుండా అప్రమత్తంగా వుండాలన్నారు. ముఖ్యంగా కొండవీటివాగు దాటుకొని వెళ్లే నీరుకొండ, కురగల్లు, ఎన్-6 పశ్చిమ బైపాస్, ఈ-10 రహదార్ల వద్ద వాగు వొంపులుగా వున్న ప్రదేశాలలో అడ్డంకులు లేకుండా చూడాలన్నారు. ప్రధానంగా అమృత విశ్వ విద్యాలయం వద్ద ప్రవాహం తీరు వేగంగా జరిగే విధంగా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. పాలవాగు కొండవీటి వాగులో కలిసే కృష్ణాయపాలెం వద్ద స్వీయపరిశీలన జరిపారు. కొండవీటి వాగు కృష్ణానదిలో కలుస్తున్న ఉండవల్లి ఇరిగేషన్ పంపింగ్ స్టేషన్‌ను పరిశీలించారు. వరద నీటి ఎత్తిపోత పరిస్థితిని సమీక్షించారు. కొండవీటి వాగు పరివాహక ప్రాంతంలో ఇంజినీర్లు అనుక్షణం వరద నియంత్రణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు.



పునరావాస కేంద్రాలను పరిశీలిస్తున్న జేసీ ఇలక్కియా, మొగల్రాజపురం కొండప్రాంతాల్లో బాధితులకు భరోసా కల్పిస్తున్న ఆర్డీవో కావూరి చైతన్య, పునరావాస కేంద్రాల్లో సూచనలు చేస్తున్న ఆర్డీవో మాధురి

సర్వసన్నద్ధం

» మొంథా తుఫానును ఎదుర్కొనేందుకు జిల్లా, నగర యంత్రాంగాలు

» ప్రాణ నష్టం నివారించటమే లక్ష్యంగా టీమ్ ఎన్టీఆర్ ఆపరేషన్

» అన్ని శాఖల అధికారులు, ఉద్యోగులు క్షేత్రస్థాయిలో విధులు

» ముందస్తుగా అవరోధాలన్నీ తొలగింపు

» ప్రమాదకర ప్రాంతాల్లోని ప్రజలంతా సురక్షిత ప్రాంతాలకు

(ఆంధ్రజోతి, విజయవాడ) : మొంథా తుఫానును ఎదుర్కొనేందుకు జిల్లా, నగర యంత్రాంగాలు సంసిద్ధమయ్యాయి. విపత్తులను ఎదుర్కొనేందుకు ఎలాంటి పరిస్థితుల్లోనైనా తక్షణం రంగంలోకి దిగి పరిష్కరించేందుకు వీలుగా ఇప్పటికే ఏర్పాట్లు చేశాయి. రెండురోజులుగా జిల్లా యంత్రాంగం విశ్రాంతి లేకుండా పనిచేస్తోంది. ప్రత్యేక అధికారి శశిభూషణ్ కుమార్ మంగళవారం కమాండ్ కంట్రోల్ రూమ్‌లో జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి సత్యకుమార్ యాదవ్ నగరంలోనే ఉంటూ ఎప్పటికప్పుడు పరిస్థితులను సమీక్షిస్తున్నారు. ప్రాణనష్టం జరగకుండా ఉండేందుకు ముందస్తుగా ప్రమాదకర భవనాల నుంచి ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలిస్తున్నారు. లోతట్టు ప్రాంతాల వారిని, ప్రమాదకర ప్రాంతాలలో నివశించే వారిని పునరావాస కేంద్రాలకు తరలించారు. ఎక్కడికక్కడ జిల్లా వైద్యారోగ్యశాఖ నేతృత్వంలో శిబిరాలను నిర్వహిస్తున్నారు. కాలువల డీసిల్టింగ్ ప్రక్రియ ముమ్మరంగా జరుగుతోంది. వర్షం కురిస్తే వరద నీరు పారటానికి మేజర్ డ్రెయిన్లు, ఔట్ ఫాల్ డ్రెయిన్స్ అన్నింటిలోనూ డీసిల్టింగ్ చేపట్టారు. మరో వైపు విద్యుత్ సిబ్బంది కూడా అనుక్షణం అప్రమత్తంగా ఉంటున్నారు. విద్యుత్ అంతరాయాలు వాటిల్లితే వెంటనే పునరుద్ధరించగలుగుతున్నారు. దీనికోసం విద్యుత్ శాఖ మొబైల్ టీమ్స్‌ను సిద్ధం చేసింది. గ్రామ సచివాలయాల పరిధిలో జనరేటర్లను సిద్ధం చేశారు. నగరంలో చెట్ల కొమ్మలు విరిగే ప్రాంతాలను గుర్తించి ముందస్తుగా నరికివేయించారు. జిల్లా వ్యాప్తంగా లోతట్టు ప్రాంతాల్లో అధికార యంత్రాంగం మోటార్లతో సిద్ధంగా ఉంది. అగ్నిమాపక శాఖ బృందాలు ఎక్కడికక్కడ వాహనాలతో సిద్ధంగా ఉన్నాయి. వ్యవసాయ, ఉద్యాన శాఖఅధికారులు రైతులను అప్రమత్తం చేస్తున్నారు. ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో రెండురోజులుగా అవగాహన కల్పిస్తున్నారు. తుపాను నష్టం జరిగితే వేగంగా అంచనా వేసేందుకు తగిన బృందాలను సిద్ధం చేశాయి.



కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి మాట్లాడుతున్న అధికారులు శశిభూషణ్ కుమార్, లక్ష్మీశ

కలెక్టరేట్ : తుఫానును ఎదుర్కోవడానికి జిల్లా యంత్రాంగం సంసిద్ధంగా వుందని ఎన్టీఆర్ జిల్లా తుఫాను ప్రత్యేక అధికారి శశిభూషణ్ కుమార్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ లక్ష్మీశతో కలిసి కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ఆయన పరిశీలించి జిల్లావ్యాప్తంగా చేపట్టిన చర్యలను అడిగి తెలుసుకొన్నారు. విపత్తు ఎదుర్కోవడానికి అవసరమైన జేసీబీ, ట్రాక్టర్లు, యంత్రాలను పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, ముఖ్యమంత్రి సూచనల మేరకు జిల్లాయంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసిందని, కీలక శాఖల సిబ్బంది తుఫాను ప్రతిస్పందన చర్యలలో నిమగ్నమై వున్నారని చెప్పారు. అన్ని వసతులతో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశారని, క్షేత్రస్థాయి యంత్రాంగమంతా సమర్థవంతంగా పనిచేస్తోందని చెప్పారు. ఇప్పటి

ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నాం

- ప్రత్యేక అధికారి శశిభూషణ్ కుమార్

వరకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదని తెలిపారు. ఇది తీవ్ర తుపాను అని, ప్రజలు నిరంతరం అప్రమత్తంగా వుండాలని సూచించారు. ప్రజలు ఏర్పాట్లు, చర్యలపై తమకు ఫీడ్ బ్యాక్ ఇవ్వొచ్చని చెప్పారు. కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ, అవేర్ వెబ్‌సైట్ ద్వారా తుఫాను గమనాన్ని ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నామని చెప్పారు. ఇప్పటికే తుఫాను ముప్పు పొంచి వున్న గ్రామాల, ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేశామని చెప్పారు. వర్షపు నీరు రోడ్లపై నిలవకుండా కాలువల్లోని నీటిని నియంత్రిస్తున్నామని, బుడమేరుపై దృష్టి సారిస్తున్నామని చెప్పారు. రైతులు పంట కోతలు కోయరాదని, మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లవద్దని సూచించారు.

క్షేత్రస్థాయి పర్యటనలతో భరోసా

కలెక్టరేట్/విద్యాధరపురం : ఎన్టీఆర్ జిల్లాలో మొంథా తుపాను వల్ల ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం సంభవించకుండా ఉండేందుకు అధికారులంతా క్షేత్రస్థాయిలో పర్యటించి ఏర్పాట్లు సక్రమంగా ఉన్నాయో లేదో పరిశీలించారు. ప్రజా భద్రత, క్షేమమే లక్ష్యంగా తుపాను ప్రతిస్పందన చర్యలు తీసుకున్నామని, విజయవాడ అర్బన్, గ్రామీణ ప్రాంతాలతో పాటు నందిగామ, తిరువూరు డివిజన్లలోనూ అన్ని సౌకర్యాలతో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశామని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. మంగళవారం కలెక్టర్ లక్ష్మీశ విజయవాడ అర్బన్ పరిధిలోని విద్యాధరపురం జీఎస్ఆర్ స్కూల్‌లోని పునరావాస కేంద్రాన్ని తనిఖీ చేశారు. ముప్పు పొంచి వున్న ప్రాంతాలను, పునరావాస కేంద్రాలను జాయింట్ కలెక్టర్ ఇలక్కియా, విజయవాడ ఆర్డీవో కావూరి చైతన్య, నందిగామ ఆర్డీవో కె.బాలకృష్ణ, తిరువూరు ఆర్డీవో కె.మాధురి సందర్శించి,



పునరావాస కేంద్రంలో ఆహారం అందజేస్తున్న కలెక్టర్

అధికారులకు సూచనలు చేశారు. పునరావాస కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు ఉన్నాయో లేదో తనిఖీ చేశారు. మండలస్థాయి విపత్తు స్పందన బృందాలతో పాటు గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలోని బృందాల సిబ్బందితో మాట్లాడి ఏమాత్రం అలసత్వానికి తావులేకుండా నిరంతరం అప్రమత్తంగా వుండాలని ఆదేశించారు. జేసీ ఇలక్కియా కంచికచర్ల మండలంలోని పరిటాల చెరువుతో పాటు స్థానికంగా ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రాన్ని, వాటర్ స్టోరేజ్ ట్యాంకును పరిశీలించారు. నందిగామ మండలం ఐతవరం గ్రామంలో వరి పొలాలను, రైతు సేవా కేంద్రాన్ని, పునరావాస కేంద్రాన్ని, నందిగామలో వరద ముప్పు పొంచి వున్న డీవీఆర్ కాలనీని పరిశీలించారు. జగ్గయ్యపేట పురపాలక సంఘం కార్యాలయం, చిల్లకల్లు ఎంపీడీఓ కార్యాలయంలో సిద్ధంగా వుంచిన యంత్ర సామగ్రిని, పాఠశాలలో పునరావాస కేంద్రాన్ని పరిశీలించారు.



పునరావాస కేంద్రంలో ప్రజలకు ఆహారం అందజేస్తున్న మంత్రి సత్యకుమార్

రియల్ టైం డేటా ఆధారంగా చర్యలు..

» జిల్లా ఇన్‌చార్జి మంత్రి సత్యకుమార్ యాదవ్

కలెక్టరేట్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుపాను నేపథ్యంలో విజయవాడ అర్బన్ పరిధిలో కొండ ప్రాంతాల ప్రజల భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టడం వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. మంగళవారం రాత్రి కలెక్టరేట్‌లోని కమాండ్ కంట్రోల్ కేంద్రాన్ని మంత్రి సందర్శించారు. రెవెన్యూ, పంచాయతీ రాజ్, ఇరిగేషన్, మున్సిపల్, వ్యవసాయం, అగ్నిమాపక తదితరశాఖల అధికారులతో మాట్లాడి ప్రస్తుత పరిస్థితిపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ, ఆర్‌టీజీఎస్ సూచనల మేరకు జిల్లాలో విపత్తును ఎదుర్కొనేందుకు అన్ని చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. ఇందుకు ప్రత్యేకంగా ర్యాపిడ్ రెస్పాన్స్ బృందాలు సిద్ధంగా వున్నట్టు వెల్లడించారు. విజయవాడ అర్బన్ ప్రాంతంలో కొండ ప్రాంతాల్లో కొండచరియలు విరిగిపడేందుకు అవకాశమున్న ప్రాంతాలపై ప్రత్యేకంగా దృష్టిపెట్టి, ముప్పు వున్న ఆవాసాల్లోని వారిని పునరావాస కేంద్రాలకు తరలించి అన్ని సౌకర్యాలు కల్పించినట్టు వివరించారు. అవసరమైన మందులతో పాటు 108, 104 ద్వారా సమర్థవంతంగా సేవలందించేందుకు చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. కలెక్టర్ లక్ష్మీశ, నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్రతో కలిసి చిట్టినగర్ రాకేష్ ఈఎం హైస్కూల్‌లోని పునరావాస కేంద్రాన్ని పరిశీలించారు.

వణికించిన మొంథా

(5వ పేజీ తరువాయి)

100 కిలోమీటర్ల దూరంలోకి రావటంతో మధ్యాహ్నం మూడు గంటల నుంచి గాలుల తీవ్రత పెరగటంతో పాటు భారీ వర్షం కురిసింది. మంగళవారం ఉదయం ఎనిమిదిన్నర నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు అత్యధికంగా తోట్లవల్లూరులో 16 మిల్లీమీటర్లు, అత్యల్పంగా ఉయ్యూరులో 3.20 మిల్లీమీటర్లు పడింది. జిల్లా సగటు వర్షపాతం 5.85 మిల్లీమీటర్లుగా నమోదైంది.

మంత్రుల పర్యటన

మచిలీపట్నం మండలంలోని తాళ్లపాలెం పంచాయతీ గిరిపురంలోని మండల పరిషత్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని జిల్లా ఇన్‌చార్జి మంత్రి వాసంశెట్టి సుభాష్, మంత్రి కొల్లు రవీంద్ర, ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు సందర్శించారు. అక్కడ ఏర్పాట్లను పరిశీలించి ప్రజలతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం మంగినపూడి బీచ్‌ను సందర్శించి ఎగిసిపడుతున్న అలలను పరిశీలించారు. తుఫాను కారణంగా జిల్లాలో నెలకొన్న పరిస్థితులపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి విపత్తునైనా ఎదుర్కొనేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. జిల్లాలోని 26 మండలాల్లో 207 గ్రామాలకు తుఫాను ప్రమాదం పొంచి ఉందని తెలిపారు. తుఫాను తీవ్రస్థాయిలో వస్తుందని, ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా జాగ్రత్తలు తీసుకున్నామని వివరించారు. మచిలీపట్నం, గుడివాడలో ఎన్‌డీఆర్ఎఫ్, ఎఫ్‌డీఆర్ఎఫ్ బృందాలను సిద్ధం చేసినట్లు తెలిపారు. నావికాదళం, సైనికదళం సేవలను కూడా అవసరమైన పక్షంలో వినియోగించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. రెవెన్యూ, పోలీస్, విద్యుత్తు తదితర అన్ని ప్రభుత్వ శాఖలు తుఫాను సహాయక చర్యలు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. కమ్యూనికేషన్ వ్యవస్థ దెబ్బతినకుండా మొబైల్ నెట్‌వర్క్ సంబంధించి అదనంగా జనరేటర్లు ఏర్పాటు చేశామన్నారు. పునరావాస కేంద్రాల్లోనూ ఉచిత వైద్య ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేసి అవసరమైన మందులను అందుబాటులో ఉంచామని తెలిపారు.

రైతుల్లో ఆందోళన

జిల్లాలో 1.60 లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారు. 70 శాతం పంట పొలాలు ఈనిన కంకులు పాలుపోసుకొనే దశలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో భారీ వర్షాలకు తోడు బలమైన గాలులు వీస్తుండటంతో వరి నేలవాలే ప్రమాదం ఏర్పడింది. కోడూరు, కంకిపాడు, మచిలీపట్నం, పామర్రు, మొవ్వ తదితర ప్రాంతాల్లో కోతకు సిద్ధంగా ఉన్న వరి నేలవాలి నీటిలో నానుతోంది. బుధవారం వరకు జిల్లాలో భారీ వర్షాలు కురుస్తాయనే హెచ్చరికలు రైతులను కలవరపాటుకు గురిచేస్తున్నాయి. మంగళవారం రాత్రి తుపాను తీరం దాటే సమయంలో 90 నుంచి 100 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయనే హెచ్చరికలతో వరి పంట చేతికి అందుతుందా అనే అనుమానం రైతులు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఎకరానికి రూ.30 వేల వరకు ఖర్చు చేశామని, భారీ వర్షాలు కురిస్తే పెట్టిన పెట్టుబడి చేతికి అందదని ఆందోళన చెందుతున్నారు. పెడన మండలంలోని నందమూరులో యంత్రాల ద్వారా వరికోతలు కోశారు. ధాన్యం రాశులపై ఉంది. భారీ వర్షాలు కురవటంతో పరజాలు కప్పి ఉంచారు. ధాన్యంలో తేమ శాతం అధికంగా ఉండగా, పరజాలు కప్పి ఉంచడంతో మరింత తేమ పెరిగి వాసన వస్తోంది.

చకచకా రేషన్

(5వ పేజీ తరువాయి)

నిత్యావసరాల సరఫరా జరిగింది. ఆయా డిపోల పరిధిలో ఉదయం నుంచి నిత్యావసరాల పంపిణీ చేపట్టారు. మధ్యాహ్నం నాటికి 41 శాతం మేర లబ్ధిదారులకు అందించారు. కృష్ణాజిల్లాలో మొత్తం 69,680 మంది వృద్ధులకు డోర్ డెలివరీ చేపట్టాల్సి ఉండగా.. మధ్యాహ్నం నాటికి 23,309 మందికి పూర్తిచేశారు. అత్యవసర పరిస్థితుల్లో ఆయా మండలాల పరిధిలో తహసీల్దార్లు బియ్యం కోరితే ఇవ్వాల్సిందిగా రేషన్ డీలర్లకు ఎన్టీఆర్, కృష్ణాజిల్లా సివిల్ సప్లయిస్ అధికారులు పాపారావు, మోహన్‌బాబు ఆదేశాలు జారీ చేశారు. డీలర్లకు అవసరమైనంత తాము తిరిగి డెలివరీ చేస్తామని తెలిపారు.

- ఎల్‌పీజీ డీలర్లు తగిన సంఖ్యలో గ్యాస్ సిలిండర్లను సిద్ధం చేసుకోవాల్సిందిగా రెండు జిల్లాల సివిల్ సప్లయిస్ అధికారులు ఆదేశించారు. ఈ మేరకు గ్యాస్ ఏజెన్సీలన్నింటికీ ఆదేశాలు జారీ చేశారు. గ్యాస్ ఏజెన్సీల దగ్గర ఎంతెంత నిల్వలు ఉన్నాయో తెలుసుకుని ఆ మేరకు రిజర్వులో ఉంచాలని సూచించారు.

- అత్యవసర సమయాల్లో ప్రభుత్వ అవసరాలకు వినియోగించేలా అదనంగా పెట్రోల్, డీజిల్ నిల్వలు ఉంచాల్సిందిగా రెండు జిల్లాల్లోని పెట్రోల్ బంకుల యజమానులకు ఆదేశాలు జారీ చేశారు. బంకుల వారీగా ఆయిల్ నిల్వల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయిల్ కంపెనీల నుంచి మరింతగా దిగుమతి చేసుకోవాలని సూచించారు. బంకుల్లో ఎంత మేర ఆయిల్ నిల్వలు ఉన్నాయో కూడా అధికారులు పరిశీలిస్తున్నారు.

అద్విక ఆదిత్య అరెస్టు

(5వ పేజీ తరువాయి)

నాలుగు శాతం వడ్డీ చెల్లిస్తామని ప్రకటించారు. ఈవిధంగా ప్రజల నుంచి పెట్టుబడులను స్వీకరించారు. ఇలా కొత్త ఖాతాదారులు ఇచ్చిన డబ్బులతో పాత ఖాతాదారులకు చెల్లింపులు చేశాడు. 2023లో సృష్టించుకున్న వార్షికోత్సవం పేరుతో ఒక ఈవెంట్‌ను నిర్వహించి మరిన్ని డిపాజిట్లు సేకరించారు. కొంతమంది లాభాలకు ఆశపడి అద్వికకు ఏజెంట్లుగా మారి ఆదిత్యకు సహకరించారు. కొంత డబ్బును ఆదిత్య మల్టీ బ్యాంక్ గ్రూపునకు బదిలీ చేశాడు. ఈ డబ్బులను తన వ్యక్తిగత ప్రయోజనాలకు ఉపయోగించుకున్నాడు. ప్రజల నుంచి సేకరించిన పెట్టుబడులతో ఆదిత్య రెండు తెలుగు రాష్ట్రాల్లో స్థిర, చరాస్తులను సమకూర్చుకున్నాడు. కొన్ని ఆస్తులను ఆదిత్య తన పేరున, మరికొన్ని ఆస్తులను భార్య సుజాత పేరున రిజిస్ట్రేషన్ చేయించాడు. 2022 నుంచి ఈ ఏడాది జూన్ వరకు ఆదిత్య 1,417 మంది నుంచి రూ.413.03 కోట్లను డిపాజిట్లుగా సేకరించాడు. అందులో కొంత భాగాన్ని దుబాయిలో ఉన్న కబానా ట్రేడింగ్, మల్టీ బ్యాంకింగ్ ఫారెక్స్ వంటి విదేశీ ట్రేడింగ్ కంపెనీలకు బదిలీ చేశాడు. అద్వికలో మొత్తం 1,139 మంది ఖాతాదారులు రూ.255 కోట్లు పెట్టుబడిగా పెట్టారు. అందులో నుంచి రూ.120 కోట్లు వెనక్కి తీసుకున్నారు. వారు ఇంకా రూ.135 కోట్లు నష్టపోయారు. 204 మంది డిపాజిటర్లు రూ.35 కోట్లను పెట్టుబడిగా పెట్టి రూ.56 కోట్లు వెనక్కి తీసుకున్నారు. పెట్టుబడి కంటే రూ.21 కోట్లను అదనంగా తీసుకున్నారు. దీన్ని లాభంగా పరిగణించారు. 12 మంది ఖాతాదారులు రూ.1.8 కోట్లు పెట్టుబడిగా పెట్టారు. ఈ మొత్తాన్ని వెనక్కి తీసుకున్నారు. వాళ్లంతా లాభపడలేదు. అలాగని నష్టపోలేదు. 30 మంది ఏజెంట్లు రూ.54 కోట్లను పెట్టుబడులుగా పెట్టించి రూ.45 కోట్లను అద్విక నుంచి వెనక్కి తీసుకున్నారు. వాళ్లంతా రూ.9 కోట్ల వరకు నష్టపోయారు. 32 మంది ఏజెంట్లు రూ.54 కోట్లను పెట్టుబడిగా పెట్టి రూ.105 కోట్లను వెనక్కి తీసుకున్నారు. రూ.49 కోట్లను లాభాలుగా పొందారు. దుబాయిలో ఉన్న కబానా, మల్టీ బ్యాంకింగ్ ఫారెక్స్‌లో రూ.13.5 కోట్లను పెట్టుబడి పెట్టి రూ.27.5 కోట్లను వెనక్కి తీసున్నాడు. తద్వారా రూ.14 కోట్లు లాభాలను పొందాడు. కార్యాలయ ఖర్చులకు రూ.8 కోట్లు, వ్యక్తిగత ఖర్చులుగా రూ.12.5 కోట్లు ఖర్చు చేశాడు. మరో రూ.39.5 కోట్లను ఆదిత్య తన వద్ద భద్రపరుచుకున్నాడు. 92 మంది ఖాతాదారులు రూ.9.47 కోట్లను పెట్టుబడి పెట్టారు. వారు అసలు గానీ, లాభాలు గానీ పొందలేదు. పెట్టుబడుల ద్వారా ఆదిత్య 52 ఆస్తులను కొనుగోలు చేశాడు. వాటి మార్కెట్ విలువ రూ.100 కోట్లు ఉంటుందని పోలీసు కమిషనర్ తెలిపారు. ఆదిత్య, అతని భార్య సుజాత నుంచి 580 గ్రాముల బంగారం, 8.03 కిలోల వెండిని, రూ.23 లక్షలను స్వాధీనం చేసుకున్నారు. అద్విక పేరుతో ఉన్న 17 బ్యాంకు ఖాతాల్లో రూ.32 లక్షలు, కబానా, మల్టీబ్యాంక్‌కు చెందిన 69 ఖాతాల్లో రూ.50 లక్షలు, మూడు ట్రేడింగ్ ఖాతాల్లో రూ.53 లక్షలు, 200 ఏజెంట్ల ఖాతాల్లో రూ.1.02 కోట్లు ఉన్నట్టు గుర్తించారు. వాటిని పోలీసులు స్తంభింపజేశారు. మరో రూ.39.50 కోట్లు లెక్కలు తేలాల్సి ఉంది. టాటా సఫారి కారు, ల్యాప్ టాప్‌లు, కంప్యూటర్లు స్వాధీనం చేసుకున్నారు.

పత్తి రైతు కుదేలు!

» చెట్లపైనే దూదిలో విత్తనాలకు మొలకలు


» నల్లబారి పూర్తిగా విచ్చుకోని కాయలు

» ఎడతెరిపిలేని వర్షాలకు సాగని పత్తి తీతలు

» వేధిస్తున్న కూలీల కొరత

(ఆంధ్రజ్యోతి, ఇబ్రహీంపట్నం)

మొంథా తుపాను ప్రభావంతో పత్తి రైతు మరింత చిత్తయ్యాడు. ముసురుకున్న వాతావరణం ఎడతెరిపిలేని వర్షంతో విచ్చుకున్న పత్తికాయల విత్తనాల నుంచి మొలకలు వచ్చాయి. వర్షాలకు పాడైన పత్తిచేలతో రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. రోజుకు వెయ్యి రూపాయిలకు పైగా సంపాదించే మహిళా కూలీలు పనిలేక ఇళ్లకే పరిమితమయ్యారు. పత్తిపంటపై ఆధారపడి జీవించే అనేక మంది జీవనోపాధిని అకాల వర్షాలు తీవ్రంగా దెబ్బతీశాయి. ముమ్మరంగా పత్తి తీతలు సాగే సమయంలో ఏంచేయాలో తోచక తుఫాన్ హెచ్చరికలు గురించి చర్చించుకుంటూ ఖాళీగా ఉండాల్సిన దయనీయ పరిస్థితులు దాపురించాయి. కొందరు ధైర్యం చేసి చేలల్లోకి వెళుతుంటే మరికొందరు పాడైనచేలవైపే కన్నెత్తిచూడటం మానేశారు.



వర్షాలకు నాని చెట్లపైనే దూదిలో మొలకెత్తిన గింజలు

చెట్ల మీదే మొలకలు

గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈఏడాది పత్తి పంటను వర్షాలు నాశనం చేశాయి. పిక్కింగ్‌కు వచ్చిన పత్తి తీయకపోవడంతో వర్షాలకు నాని దూదిలో ఉన్న పత్తి గింజలు మొలకలు వస్తున్నాయి. ఇప్పటికే 20 శాతం పైగా చెట్లకు దూదిలో గింజలు మొలకలు వచ్చాయి. మరో రెండు మూడు రోజులు ఇలానే వర్షాలు పడుతూ ఉంటే సగానికి పైగా దూదిలోని గింజలు మొలకలు వస్తాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. లోతట్టు, పల్లపు ప్రాంతాల్లో ఉన్న పొలాలు ఇప్పటికే రంగు మారిపోయాయని, చెట్లు కూడా చచ్చిపోతున్నాయని, గుబురుగా ఉన్న చేలల్లో గాలి ఆడక కాయలు పూర్తిగా నల్లబారిపోతున్నాయని రైతులు వాపోతున్నారు.

బరువు మీద తీవ్ర ప్రభావం

చెట్లకు ఉన్న దూదిలోని గింజలు మొలకలు రావడంతో బరువుపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంది. క్వింటా పత్తిలో గింజలు 60 కిలోలు బరువు ఉంటే 40 కేజీలు దూది బరువు ఉంటుంది. ఇప్పుడు గింజలు మొలకలు రావడంతో బరువు పూర్తిగా తగ్గిపోతుందని కాటావేసినా బరువు రాదని రైతులు చెబుతున్నారు. బరువు రాని పత్తిని తీయించినా వచ్చే డబ్బులు కూలీల ఖర్చులకు సరిపోయే పరిస్థితులు లేవని రైతులు ఆవేదన చెందుతున్నారు.

ఎకరానికి రూ.50 వేలు పెట్టుబడి పెట్టాం

- బజిల్లా (కౌలురైతు జి.కొండూరు)



ఇప్పటి వరకు ఎకరానికి రూ.50 వేలవరకు పెట్టుబడి పెట్టాం. కౌళ్లు ముందే కట్టాం. పంట బాగుంది అనుకునే సమయంలో వర్షాలు మొదలయ్యాయి. అక్టోబరులో వర్షాలు కోలుకోలేని విధంగా దెబ్బతీశాయి. పెట్టుబడిలో సగం దక్కినా దక్కినట్లే అనుకున్నాం. ఇప్పుడు తుపాన్‌తో సగం పెట్టుబడి కూడా దక్కే పరిస్థితి లేదు. వర్షాలు వదలడం లేదు. ఇప్పటికే చెట్ల మీద ఉన్న దూదిలోకి గింజలు మొకలు ఇచ్చేశాయి. ఉన్న కాయలు నిలువునా కుళ్లిపోతున్నాయి.

ప్రభుత్వం ఆదుకోవాలి

- ఎం.అంజలీదేవి (కౌలు రైతు.. జి.కొండూరు)



వర్షాలు పూర్తిగా ముంచేశాయి. పత్తి సాగు చేసిన రైతుల్ని ప్రభుత్వం ఆదుకోవాలి. వర్షాలు పోయిన తర్వాత తీసిన నాణ్యత లేని పత్తిని ప్రభుత్వం కొనుగోలు చేయాలి. క్వింటా పత్తి తీసేందుకు కూలీ ఖర్చు అధికమవుతోంది. నాణ్యత లేని పత్తిని క్వింటా రూ.3 వేలకు కొనుగోలు చేసేవారులేరు. ప్రభుత్వం ఆదుకోకుంటే ఆత్మహత్యలే శరణ్యం.

బుడమేరు వరద ముంపు నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవాలి: ఆళ్ల

హనుమాన్‌జంక్షన్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ కారణంగా బుడమేరు వరద ముంపు ప్రమాదం వచ్చే అవకాశం ఉందని దానికి ముందస్తు చర్యలు తీసుకోవాలని నాగార్జున సాగర్ ఎమడ కాలువ ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ ఆళ్ల గోపాలకృష్ణ బాపులపాడు మండల స్థాయి అధికారులకు సూచించారు. మంగళవారం బాపులపాడు మండల పరిషత్ కార్యాలయంలో మండల ప్రత్యేక అధికారి కె. రాజేంద్రబాబు, ఎంపీడీవో జోగేశ్వరరావు,తహల్దార్ బి.మురళీకృష్ణలను కలిసి తుఫాన్ ప్రభావం కారణంగా ఎదురయ్యే సమస్యలపై చర్చించారు.


అధికారులతో చర్చిస్తున్న ఆళ్ల గోపాలకృష్ణ

అండగా ఉంటాం.. అప్రమత్తంగా ఉండండి

● ఎంతటి విపత్తునైన ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నాం
● పుకార్లు నమ్మవద్దు ● తుఫాను బాధితులందరికీ పరిహారం ఇస్తాం
● ఆకలి తీర్చేందుకు అవసరమైతే సొంత నిధులు వెచ్చిస్తా
ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు


కేసరపల్లి పునరావాస కేంద్రంలో బాధితులకు భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

గన్నవరం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాను కారణంగా ఎటువంటి విపత్తు వచ్చినా ఎదుర్కొనేందుకు ప్రభుత్వ యంత్రాంగం సిద్ధంగా ఉందని, అందరికి అండగా ఉంటాం.. మీరు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. మండలంలోని కేసరపల్లి తుఫాను పునరావాస శిబిరాలను మంగళవారం సందర్శించారు. ముందుగా చెంచుల కాలనీలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస శిబిరాన్ని అనంతరం కేసరపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శిబిరాన్ని సందర్శించి బాధితులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పునరావాస శిబిరంలోని వసతులను పరిశీలించిన ఆయన బాధితులకు అందిస్తున్న ఆహారాన్ని రుచి చూశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, మండలంలోని కేసరపల్లి గ్రామంతో పాటు చనుపల్లివారి గూడెం, కట్టుబడిపాలెం, కొండపావులూరు, పురుషోత్తపట్నం గ్రామాల్లో పునరావాస శిబిరాలు ఏర్పాటు చేసి 450 మందిని శిబిరాలకు తరలించినట్లు తెలిపారు. శిబిరాలలో తలదాచుకున్న బాధితులకు ఏవిధమైన ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అదృష్టవశాత్తు ఇతర జిల్లాలతో పోల్చుకుంటే కృష్ణాజిల్లాలో తుఫాను ప్రభావం తక్కువగా ఉందని, నియోజకవర్గంలో వర్షపాతం తక్కువగా నమోదు అయిందన్నారు. నియోజకవర్గంలోని అధికారులు అందరూ తుఫాన్ ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నారని లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేస్తూ పునరావాస శిబిరాలకు తరలించేందుకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే యార్లగడ్డ తెలిపారు. వాతావరణ శాఖ అధికారుల అంచనాల మేరకు భారీ వర్షాలు కురిస్తే పునరావాస శిబిరాలను మరిన్ని పెంచాల్సి ఉంటుందని, ఇందుకోసం అవసరమైతే గతంలో బుడమేరు వరదల మాదిరిగా తన సొంత నిధులు వెచ్చించి కళ్యాణ మండపాలను అద్దెకి తీసుకొని బాధితులను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. స్థానికులు ఇళ్ల స్థలాలు సమస్యను ప్రస్తావించగా పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చే అంశం ఇప్పటికే ప్రభుత్వ పరిశీలనలో ఉందని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న వెంటనే ఇల్లు లేని పేద వారందరికీ ఇళ్ల స్థలాలు ఇస్తానని హామీ ఇచ్చారు. నియోజక వర్గంలోని టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు తుఫాన్ సహాయ చర్యల్లో పాల్గొని ప్రస్తుత విపత్కర పరిస్థితుల్లో తుఫాన్ బాధితులకు అండగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు గూడపాటి తులసి మోహన్, నాయకులు దొంతు చిన్న, చిరుమామిళ్ల సూర్యం, ఏఎంసీ చైర్మన్ గూడవల్లి నరసింహారావు, దయ్యాల రాజేశ్వరరావు, గొడ్డళ్ళ చిన్న రామారావు, కొలుసు రవీంద్రబాబు, అన్నే హరికృష్ణ, బోడపాటి రవి , మల్లంపాటి జయకృష్ణ, కొసరాజు సాయిరాం, మేడేపల్లి రమ, జాస్తి శ్రీధర్, బండి వెంకట్రావు, వైస్ ఎంపీపీ కొమ్మరాజు సుధీర్, పడమట రంగారావు, బుస్సే నాగప్రసాద్ పాల్గొన్నారు.

ప్రాణ, ఆస్తి నష్టం నివారించేలా ప్రభుత్వ చర్యలు

● ఎమ్మెల్యే బోడె ప్రసాద్

పెనమలూరు : మొంథా తుఫాను ప్రభావం వల్ల ప్రాణ, ఆస్తి నష్టం నివారించి ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూసేందుకు ప్రభుత్వ యంత్రాంగం పూర్తి సిద్ధంగా ఉన్నట్లు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే తుఫాను ప్రభావాన్ని పరిశీలించేందుకు నియోజకవర్గ వ్యాప్తంగా తిరిగి పునరావాస కేంద్రాలలో ఉన్న ప్రజలను పలకరించి వారితో మాట్లాడారు. పెనమలూరులోని బీసీ వసతి గృహంలో ఉన్న ప్రజలతో మాట్లాడుతూ, నియోజకవర్గంలో అధికార యంత్రాంగం, సిబ్బందితో సమీక్షలు నిర్వహించి పూర్తి స్థాయిలో తుఫాన్ ప్రభావాన్ని అంచనా వేశామని తెలిపారు. ప్రజలను వసతి ఏర్పాట్ల గురించి అడిగి తెలుసుకొన్నారు. భోజన ఏర్పాట్లలో ప్రమాణాలను పరిశీలించి టీడీపీ నేతలు అనుమోలు ప్రభాకరరావు, కోయ ఆనంద్‌ప్రసాద్‌లతో కలిసి వారికి భోజనం వడ్డించారు.

పండ్లు, బిస్కట్లు పంపిణీ

పోరంకిలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో టీడీపీ కూటమి నేతలు ప్రజలకు బిస్కట్లు, పండ్లు తదితర ఆహార పదార్థాలను పంపిణీ చేశారు. పునరావాస కేంద్రంలో ఆశ్రయం పొందుతున్న వారి అవసరాలు తీర్చే క్రమంలో ఖర్చుకు వెనుకాడబోమని టీడీపీ నేతలు అనుమోలు ప్రభాకరరావు, కోయ ఆనంద్‌ప్రసాద్‌లు తెలిపారు. బోడె మనోజ్, చెన్నుపాటి శ్రీనివాస్ ఉన్నారు.


పెనమలూరు పునరావాస కేంద్రంలో ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

పునరావాస కేంద్రాలకు 169 కుటుంబాలు



హనుమాన్‌జంక్షన్: మొంథా తుఫాన్ నేపథ్యంలో తీసుకున్న ముందస్తు చర్యల్లో భాగంగా మంగళవారం బాపులపాడు జడ్పీ హైస్కూల్‌లో పునరావాస కేంద్రం తెరిచారు. కేంద్రానికి ఎంజీ నగర్ కాలనీకి చెందిన ఆరు కుటుంబాలను తరలించారు. మండల ప్రత్యేకాధికారి కె. రాజేంద్రబాబు, తహసీల్దార్ మురళీ కృష్ణ, ఎంపీడీవో జోగేశ్వరరావు తదితరులు కేంద్రాన్ని పరిశీలించారు. మండలంలో ఇప్పటికే ఆరుగొలను, ఓగిరాల, కానుమోలు, బొమ్ములూరు. పెరికీడు, ఉమామహేశ్వరపురం, మల్లవల్లి, వీరవల్లి గ్రామాల్లో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశామని ప్రత్యేకాధికారి రాజేంద్రబాబు తెలిపారు.

తుఫాను బాధితులకు టీడీపీ నేతల చేయూత

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : మొంథా తుఫాన్ నేపథ్యంలో ఆరుగొలనులో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు బాధితులు చేరుకునేలా టీడీపీ అధ్యక్షుడు బేతా శేషుకుమార్ ఆధ్వర్యంలో రవాణా సదుపాయం ఏర్పాటు చేశారు. వృద్ధులను, పిల్లలను స్వయంగా తీసుకువచ్చేలా, అవసరమైన వారికి వైద్య సేవ లందించేలా స్థానిక వైద్య సిబ్బందితో శిబిరం కూడా నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. వీరవల్లి హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పునరావాస శిబిరంలో బాధితులకు స్థానిక టీడీపీ నేతలు అండగా నిలచారు. తెలుగురైతు రాష్ట్ర కార్యదర్శి గుండపనేని ఉమావరప్రసాద్, ఉపసర్పంచ్ లంక అజయ్‌కుమార్, తెలుగుయువత జిల్లా కార్యదర్శి మండాది రవీంద్ర, ఎంపీటీసీ అమృతపల్లి సూర్యనారాయణ తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



ఆరుగొలను పునరావాస కేంద్రాన్ని పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు

● పునరావాస కేంద్రాలకు వెళ్లేందుకు ప్రజల విముఖత

మొంథా తుఫాన్ నేపథ్యంలో బాపులపాడు మండల వ్యాప్తంగా ఈదురుగాలులతో కూడిన వర్షాలు పెరుగుతాయని లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలు తక్షణం ఇళ్లు ఖాళీ చేసి పునరావాస కేంద్రాలకు తరలి వెళ్లాలని మండల ప్రత్యేక అధికారి రాజేంద్రబాబు, తహసీల్దార్ మురళీకృష్ణ, ఎంపీడీవో జోగేశ్వరరావు కోరారు. వీరవల్లి (కోమటిగుంట చెరువు), ఉమామహేశ్వరపురం(రాయ్‌నగర్), ఎ.సీతారాంపురం గ్రామాల్లోని ప్రజలను మంగళవారం కలిసి వీరవల్లి హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి వెళ్లాలని సూచించారు. జెసీబీ, ట్రాక్టర్లతో పాటు రోప్‌పార్టీలను సిద్ధం చేసినట్టు ఎస్సై శ్రీనివాస్ వివరించారు.

పునరావాస కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేశాం : తహసీల్దార్

కంకిపాడు:పునరావాస కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేపట్టామని, ఇప్పటి వరకు సుమారు 486 మందిని వివిధ పునరావాస కేంద్రాలకు తరలించటం జరిగిందని కంకిపాడు తహసీల్దార్ భవన్నారాయణ తెలిపారు. కంకిపాడులోని బచ్చుపేటలో పునరావాస కేంద్రానికి వెళ్లేందుకు నిరాకరిస్తున్న వృద్ధులను నచ్చచెప్పి మంగళవారం పునరావాస కేంద్రాలకు తరలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ, కంకిపాడు మండలంలోని కంకిపాడులో 2, పునాదిపాడు, తెన్నేరు, ఈడుపుగల్లు, గోడవర్రు, ఉప్పలూరు గ్రామాల్లో పునరావస కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఆయా పునరావాస కేంద్రాల్లో ఇప్పటి వరకు సుమారు 486 మందిని తరలించామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి రత్నాచార్యులు, ఎంపీడీవో అనూష, ఈవో రాజేంద్ర వరప్రసాద్, వీఆర్వో సూరిబాబు, టీడీపీ నాయకులు తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.


వృద్ధులను పునరావాస కేంద్రాలకు తరలిస్తున్న తహసీల్దార్ భవన్నారాయణ, రత్నాచార్యులు

ప్రమాదకరంగా ఉన్న చెట్లు తొలగింపు

ప్రధాన రహదారుల వెంబట విద్యుత్ వైర్లపై ప్రమాదకరంగా ఉన్న భారీ వృక్షాలను విద్యుత్ శాఖ అధికారులు తొలగిస్తున్నారు. కంకిపాడులోని వరుణ మోటార్స్ ఎదురుగా ఉన్న ఓ పురాతన చెట్టు ఎండిపోయి విరిగి పడిపోయేందుకు సిద్ధంగా ఉన్న చెట్టును క్రేన్, ట్రాక్టర్ సాయంతో తొలగించారు. విద్యుత్ శాఖ ఏఈ అశోక్ కుమార్, సిబ్బంది సందీప్, సాయి తదితరులు పాల్గొన్నారు.

పునరావాస కేంద్రాల పరిశీలన

దుప్పట్లు, అల్పాహారం పంపిణీ


ముదునూరు పునరావాస కేంద్రంలో..

ఉయ్యూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుపాను నేపథ్యంలో ఉయ్యూరు, మండల పరిధిలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను అధికారులు, ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు మంగళవారం పరిశీలించారు. పునరావాస కేంద్రాల్లో వసతులు, భోజనం ఏర్పాట్లను తహసీల్దార్ సురుశ్‌కుమార్, ఎంపీడీవో శేషగిరిరావు, ఇతర అధికారులు పరిశీలించారు. ఉయ్యూరులో 3 మండల పరిధి గ్రామాల్లో 12 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి గుడిసెలు, పాకలు, శిథిలావస్థలోఉన్న ఇళ్లలో నివసించేవారిని అధికారులు, నాయకులు తరలించారు ● ముదునూరు పాఠశాలలో పునరావాస కేంద్రంను పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు, టీడీపీ నాయకుడు పొలడుగు సత్యనారాయణ సందర్శించి గిరిజన కుటుంబాలకు దుప్పట్లు, ఇతరులకు అల్పాహారం పంపిణీ చేశారు. మాజీ సర్పంచ్‌లు జ్ఞానశేఖర్, పల్లపోతు శ్రీనివాసరావు, ఏసుబాబు, డెక్కా సుబ్రమణ్యం తదితరులు పునరావాస కేంద్రాలను పరిశీలించారు. శాయిపురంలో పునరావాస కేంద్రాన్ని సర్పంచ్ జాన్‌బాషా సందర్శించి ఆహారం, ఇతర ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పోరంకి, యనలమలకుదురు హైస్కూల్‌లో..

కానూరు : మొంథా తుపాన్ నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా తాడిగడప మున్సిపాలిటీలోని పోరంకి, యనమలకుదురు జడ్పీ హైస్కూల్లో రెండు తుఫాన్ పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ షేక్ నజీర్ చెప్పారు. మంగళవారం ఆయన కానూరు లోని సచివాలయాల్లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్స్‌ను, రెండు తుపాన్ పునరావాస కేంద్రాలను పరిశీలించారు. పోరంకి స్కూల్‌లోని కేంద్రంలో 150 మంది, యనమలకుదురు కేంద్రలో నలుగురు పునరావాస నిమిత్తం ఉన్నారని తెలి పారు. ఎప్పటికప్పుడు మున్సిపల్ పరిధిలో ఏర్పాటు చేసిన 19 కంట్రోల్ రూమ్‌లు, తాడగడప మున్సిపల్ ఆఫీస్‌లో ఏర్పాటు చేసిన సెంట్రల్ కంట్రోల్ రూమ్స్‌ను పర్యవేక్షిస్తున్నామని పేర్కొన్నారు.


పోరంకి హైస్కూల్‌లోని పునరావాస కేంద్రాన్ని పరిశీలిస్తున్న కమిషనర్


అనుమోలు ప్రభాకరరావును అభినందిస్తున్న పోలీసు అధికారులు

అనుమోలుకు అభినందనల వెల్లువ

పెనమలూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : పోరంకి వాసి, సీనియర్ టీడీపీ నాయకులు, ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్సులో పర్వతారోహణలో మేటిగా ఇటీవల పేరు నమోదు అయిన అనుమోలు ప్రభాకరరావుకు మంగళవారం పలువురు టీడీపీ నేతలు, పోలీసు శాఖ అధికారులు అభినందనలు తెలిపారు. ఈసందర్భంగా కంకిపాడు సీఐ మురళీకృష్ణ మాట్లాడుతూ, 67ఏళ్ల వయస్సులో 5,642మీటర్ల ఎత్తుయిన ఎల్బ్రస్ పర్వతాన్ని అధిరోహించి రికార్డు స్థాపించడం యువతకు స్ఫూర్తినిచ్చేదిగా ఉందన్నారు. కఠోర లక్ష్యాలను చేరుకోవడంలో యువతకు దిక్సూచిగా అనుమోలు పేరెన్నిక గన్నారని కొనియాడారు. ఎస్సైలు సందీప్, తాతాచార్యులు సీఐ వెంట ఉన్నారు.


మనోజ్ జన్మదిన కేకును కట్ చేస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

ఘనంగా బోడె మనోజ్ జన్మదిన వేడుకలు

పెనమలూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి బోడె మనోజ్ (సన్నీ) జన్మదిన వేడుకలు పోరంకి టీడీపీ కార్యాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే బోడె ప్రసాద్, యువ నేత బోడె వెంకట్రాంలు మనోజ్ జన్మదిన కేకును కోసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యువత సేవా కార్యక్రమాలు చేస్తూ సమాజంలో పేరు ప్రఖ్యాతులు తెచ్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు అనుమోలు ప్రభాకరరావు, చిన్నారి, తోటకూర సుబ్బారావు, కర్లపూడి సుబ్బారావు పాల్గొన్నారు.

గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని
ముంపును నివారించాలి: యార్లగడ్డ

గన్నవరం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ముంపు బారిన పడిన ప్రజలతోపాటు ఇతర రాష్ట్రాల వలస కార్మికులను సైతం సహాయ పునరావాస శిబిరాలకు తరలించి వారికి ఆహారాన్ని అందించాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అధికారులను ఆదేశించారు. మొంథా తుఫాను సహాయ కార్యక్రమాలపై మంగళవారం సాయంత్రం గుడివాడ ఆర్డీవోతో పాటు నియోజకవర్గంలోని నాలుగు మండలాల తహసీల్దార్‌లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల వారీగా తుఫాన్ తీవ్రతను తెలుసుకుని సమస్యల పరిష్కారానికి పలు సూచనలు ఇచ్చా రు.

అభయాంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు

హనుమాన్‌జంక్షన్: అభయాం జనేయ స్వామికి ప్రీతికరమైన ప్రతి మంగళవారం రోజు స్వామి వారికి ప్రత్యేకపూజలతో పాటు దాతల సాయంతో అన్నసమారాధన నిర్వహిస్తున్నారు. జంక్షన్‌కు చెందిన కామినేని కృష్ణ చౌదరి వితరణతో 350 మందికి అన్న సంతర్పణ నిర్వహించినట్లు ఆలయ పాలక మండలి చైర్మన్ వేమూరి శ్రీనివాసరావు తెలిపారు. ఈవో తారకేశ్వరరావు పర్యవేక్షించారు.

వైభవంగా వీరభద్రస్వామి ఆలయ వార్షికోత్సవం

హనుమాన్‌జంక్షన్‌రూరల్: పెరికీడులోని శ్రీభద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయ 4వ వార్షిక ప్రతిష్ఠామహోత్సవాలు మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అర్చకులు సీతారామయ్య, శ్యామ్, మహేష్ ఆధ్వర్యంలో దాతలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేకపూజలో పాల్గొన్న దాతలు నందూరి సుబ్బారావు దంపతులు, దుట్టా కుమర్‌మంగళం దంపతులకు అర్చకులు స్వామి వారి శేషవస్త్రాన్ని అందజేసి వేదాశీర్వచనం అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు నక్కా బాబు, నందూరి శర్మ, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

కూరగాయల పంపిణీ

ఉయ్యూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపాను ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు ఉయ్యూరులో కూరగాయల కొరత ఏర్పడిన నేపథ్యంలో టీడీపీ యువనాయకుడు బోడె వెంకట్రామ్ ఆధ్వర్యంలో మంగళవారం పలు ప్రాంతాల్లో ప్రజలకు కూరగాయలు పంపిణీ చేశారు. ఉయ్యూరు పీఏసీఎస్ అధ్యక్షుడు కూనపరెడ్డి వాసు పాల్గొన్నారు. గురజాడ డొంకలో బాధితులను పార్టీనాయకుడు చిరంజీవి పునరావాస కేంద్రానికి తరలించారు.


న్యూఆటోనగర్‌లోని డ్రెయినేజీ పనులు పరిశీలిస్తున్న అధికారులు

డ్రెయిన్లలో పూడికతీత

కానూరు, అక్టోబరు28(ఆంధ్రజ్యోతి): ఏపీఐఐసీ పార్టనర్‌షిప్ సమ్మిట్-2025లో భాగంగా మంగళవారం కానూరు న్యూఆటోనగర్ లోని డ్రెయినేజీలో పూడికతీత పనులు ప్రారంభమయ్యాయి. డ్రెయినేజీ పూడిపోవడంతో మురుగునీరు న్యూ ఆటోనగర్‌లో ఎక్కడ పడితే అక్కడ నిలిచి దుర్వాసనకొడుతూ ఈగలు, దోమలకు నిలయంగా మారింది. దీనిపై నూతనంగా వచ్చిన ఐలా కమిషనర్ సీతామహాలక్ష్మి దృష్టిసారించారు. ప్రొక్లైనర్ సహాయంతో పూడిక తీయిస్తున్నారు. మొక్కలను కూడా పెంచేందుకు పార్కును అభివృద్ధి చేస్తామని సీతామహాలక్ష్మి తెలిపారు. పూడికతీత పనులను ఏపీఐఐసీ జీఎం ఎల్. సాంబశివరావు, ఐలా మేనేజర్ కరుణాకరరెడ్డి, కమిటీ సభ్యుడు పి. రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కంకిపాడు : బస్టాండ్ వద్ద చిన్నపాటి వర్షానికే చెరువును తలపిస్తుందని కంకిపాడు ఉపసర్పంచ్ రాచూరి చిరంజీవి అన్నారు. మంగళవారం ఉదయం జేసీబీల సాయంతో బస్టాండ్ వద్ద చేపట్టిన డ్రెయిన్ల పూడికతీత పనులు ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఈవో రాజేంద్ర వరప్రసాద్, శానిటరి ఇన్‌స్పెక్టర్ రామారావు, జూనియర్ అసిస్టెంట్ సూర్య తదితరులు పాల్గొన్నారు.


కంకిపాడు బస్టాండ్ సెంటర్‌లో పూడికతీత పనులు పరిశీలిస్తున్న ఉప సర్పంచ్ రాచూరి చిరంజీవి






చల్లపల్లి - బందరు రోడ్డుపై కూలిన చెట్టును తొలగిస్తున్న ఎస్సై సుబ్రహ్మణ్యం, సిబ్బంది, కృత్తివెన్ను మండలం కొమాళ్లపూడిలో తీగలపై పడిన చెట్టు, మాట్లంలో విరిగిపడిన విద్యుత్ స్తంభం, ట్రాన్స్‌ఫార్మర్, పోడు గ్రామంలో రహదారిపై నీరు



కోడూరులోని స్వతంత్రపురంలో విద్యుత్ వైర్లపై పడిన చెట్లు

భీతిల్లిన తీర ప్రజలు

●కూలిన చెట్లు, విద్యుత్‌స్తంభాలు ● అంధకారంలో గ్రామాలు ● మునిగిన రహదారులు● అవిశ్రాంతంగా శ్రమిస్తున్న విద్యుత్, రెవెన్యూ సిబ్బంది

కృష్ణాజిల్లా కేంద్రం మచిలీపట్నానికి 70 కిలో మీటర్ల దూరంలో మంగళవారం సాయంత్రం కేంద్రీకృతమైన తుఫాన్ ప్రభావంతో బలమైన గాలులు వీయడంతో తీరప్రాంత ప్రజలు భయాందోళనకు గురయ్యారు. గాలులకు దివిసీమలోని గ్రామాల్లోనూ, చల్లపల్లి, బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల్లో చెట్లు కూలి విద్యుత్ తీగలపై పడడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దివిసీమ పూర్తిగా అంధకారంలో ఉంది. విద్యుత్ ఉన్నతాధికారులు, సిబ్బంది విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు నిరంతరం శ్రమిస్తున్నారు.

కృత్తివెన్ను, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాను ప్రభావంతో తీరప్రాంతం గజగజలాడింది. తేలికపాటి వర్షాలు కురుస్తున్నప్పటికీ భీకరమైన ఈదురుగాలులు వీస్తున్నాయి. పెద్ద చెట్లు, విద్యుత్ స్థంబాలతో పాటు, ట్రాన్స్‌ఫార్మర్లు విరిగి పడిపోయాయి. విద్యుత్ తీగలపై చెట్లు పడటంతో తీగలు తెగిపోయి విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. విద్యుత్ శాఖ ఏఈ సీహెచ్ లక్ష్మీరాజేష్ తన విద్యుత్ సరఫరా పనరుద్ధరణకు, మరమ్మతులకు తీవ్రంగా శ్రమిస్తున్నారు. మండలంలోని లోతట్టు ప్రాంతాలతో పాటు, తీరప్రాంత గ్రామాల్లో రహదారులన్నీ జలమయమయ్యాయి. లక్ష్మీపురం - పోడు ప్రధాన రహదారి లక్ష్మీపురం గ్రామం వద్ద, పోడు గ్రామ సమీపంలో పూర్తిగా నీటమునిగింది. ఈ రహదారిపై పోలీసులు రాకపోకలు నిలిపివేశారు. పోడు హైస్కూల్, అంగన్‌వాడీ కేంద్రాలు జలదిగ్బంధంలో ఉన్నాయి. ఇంతేరు - పార్వతీపురం రహదారి పూర్తిగా కోతకు గురికావటంతో పోలీసు అధికారులు రహదారికి అత్యవసర మరమ్మతులు చేయించారు. పీతలావ గ్రామంలో చెట్టు రోడ్డుపై విరిగి పడింది. ఎక్స్‌కవేటర్‌తో పోలీసులు చెట్టును తొలగించి రాకపోకలు పునరుద్ధరించారు. మండలంలో విద్యుత్ సరఫరాతో పాటు, మొబైల్ సిగ్నెల్స్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్ లైన్లకు తక్షణం మరమ్మతులు చేస్తూ విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు విద్యుత్ అధికారులు, సిబ్బంది నిరంతరం శ్రమిస్తున్నారు. వాలంక గ్రామంలో కొబ్బరి చెట్టు విరిగిపడటంతో కృత్తివెన్ను గ్రామానికి చెందిన కోయి సుబ్బారావు కా లుకు తీవ్ర గాయమైంది. వైద్యం నిమిత్తం మచిలీపట్నం తరలించారు. పెదగొల్లపాలెం బీచ్‌లో సముద్రం అల్లకల్లోలంగా మారింది. అలలు ఎగసిపడుతున్నాయి. సముద్రం 200 మీటర్ల మేర ముందుకు చొచ్చుకువచ్చింది.

చల్లపల్లి : చల్లపల్లి - మచిలీపట్నం ప్రధాన రహదారిపై పలు చోట్ల ఐదు భారీ వృక్షాలు పడిపోయాయి. కోమలా నగర్‌లో ప్రధాన రహదారిపై మరో చెట్టు రోడ్డుకు అడ్డుగా పడింది. సమాచారం అందుకున్న చల్లపల్లి సీఐ కె.ఈశ్వరరావు, ఎస్సై పిఎస్‌వి.సుబ్రహ్మణ్యం తక్షణం స్పందించి పంచాయతీ, విద్యుత్ సిబ్బంది సహకారంతో, ప్రజలతో కలిసి చెట్ల తొలగింపు పనులు చేపట్టి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చేశారు.



చినగొల్లపాలెంలో ప్రజలతో మాట్లాడుతున్న డీఎస్పీ రాజా, సీఐ నాగేంద్రప్రసాద్

కృత్తివెన్నులో డీఎస్పీ రాజా పర్యటన

మొంథా తుఫాను తీవ్రత నేపథ్యంలో నష్ట ప్రభావాన్ని తగ్గించేందుకు పోలీస్ సిబ్బంది రేయింబవళ్లు శ్రమించాలని బందరు డీఎస్పీ రాజా సూచించారు. సీఐ నాగేంద్రప్రసాద్‌తో కలిసి ఆయన మండలంలో పర్యటించారు. ఇంతేరు - పార్వతీపురం రహదారికి పోలీసులు చేయించిన మరమ్మతులను పరిశీలించారు.

పోడు, పడతడిక, చినగొల్లపాలెం గ్రామాల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను సందర్శించి ప్రజలతో మాట్లాడారు. మండలంలో షాపులు మూసి, ఇళ్లకు సురక్షితంగా వెళ్లిపోవాలని, అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావొద్దని సీఐ నాగేంద్రప్రసాద్ ప్రజలను హెచ్చరించారు. ఎస్సై పైడిబాబు సిబ్బందితో ఎప్పటికప్పుడు సహాయక చర్యలు చేపట్టారు. పునరావాస కేంద్రాలను జిల్లా బీజేపీ అధ్యక్షుడు తాతినేని శ్రీరామ్, వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఉప్పాల రాములు వేర్వేరుగా సందర్శించారు. ప్రజలతో మాట్లాడి, వసతులు, సౌకర్యాలపై ఆరా తీశారు.



ఎమ్మెల్యే కాగిత పునరావాస కేంద్రాల సందర్శన

బంటుమిల్లి : బలమైన గాలుల వల్ల అర్తమూరులో చింతచెట్టు విద్యుత్ తీగలపై పడడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. మేము అండగా ఉంటాం..ప్రజలు ధైర్యంగా ఉండాలని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ భరోసా ఇచ్చారు. మొంథా తుఫాను తీవ్రత నేపథ్యంలో మండలంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను కృష్ణప్రసాద్ మంగళవారం పరిశీలించారు. సౌకర్యాలు, సహాయ కార్యక్రమాలను అడిగి తెలుసుకున్నారు. వైద్యశిబిరాలను పరిశీలించారు. అత్యవసర వైద్య సదుపాయాలకు అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు.

నష్టం జరగనీయం : మంత్రి రవీంద్ర

మచిలీపట్నం టౌన్ : మొంథా తుఫాను వల్ల ప్రాణ నష్టం, పశునష్టం జరగకుండా అన్ని విధాల ముందస్తు చర్యలు తీసుకున్నామని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణలతో కలిసి మంత్రి రవీంద్ర మంగళవారం మచిలీపట్నం నియోజకవర్గంలోని లోతట్టు ప్రాంతాల్లో పర్యటించారు. ముంపునకు గురైన సుందరయ్య నగర్, సుల్తానగరం, నారాయణపురం ప్రభావిత ప్రాంతాల్లో మంత్రి కొల్లు రవీం ద్ర పర్యటించారు. మునిసిపల్ కమిషనర్ బాపిరాజు వీధుల్లో మోటార్ల సాయంతో నీటిని తొలగించే పనులు చేపట్టడంతో అధికారులను అభినందించారు. నారాయణపురంలోని పునరావాస కేంద్రాన్ని పరిశీలించారు. కరగ్రహారం, క్యాంపుబెల్‌పేటలోని పునరావాస కేంద్రాలను మంత్రి కొల్లు రవీంద్రతో పాటు ఇన్‌చార్జి మంత్రి వాసంశెట్టి సుభాష్, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు సందర్శించారు. క్యాంపుబెల్‌పేటలోని పునరావాస కేంద్రంలో ఆహారం వండి అందించాలని ఆర్డీవో కె. స్వాతి, తహసీల్దార్ నాగభూషణంలకు మంత్రి సూచించారు. కలెక్టర్ బాలాజీ నగరంలోని లోతట్టు ప్రాంతాల్లో పర్యటించారు. శివగంగ డ్రెయిన్‌ను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. మంత్రి వెంట మార్కెట్ యార్డు చైర్మన్ కుంచే నాని, తహసీల్దార్లు మధుసూదనరావు, నాగభూషణం, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు గొర్రెపాటి గోపీచంద్, మాజీ ఎంపీపీ కాగి త వెంకటేశ్వరరావు, లోగిశెట్టి వెంకటస్వామి, పిప్పళ్ల కాంతారావు, ఇలియాస్ పాషా, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ హసీంబేగ్, నగర జనసేన అధ్యక్షుడు గడ్డం రాజు తదితరులు పాల్గొన్నారు.



సుందరయ్యనగర్‌లో పర్యటిస్తున్న మంత్రి రవీంద్ర



శివగంగ డ్రెయిన్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ డీకే బాలాజీ

దివిలో ఆరు మండలాలు అతలాకుతలం

అవనిగడ్డ : మొంథా తుఫాను ప్రభావంలో అవనిగడ్డ నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. నాగాయలంక, అవనిగడ్డ ప్రాంతాల్లో చెట్లు విరిగిపడటంతో మంగళవారం ఉదయం కొద్దిసేపు విద్యుత్ సరఫరాను ఆపి ట్రాన్స్‌ఫార్మర్‌లపై పడిన చెట్లను తొలగించారు. విద్యుత్ సరఫరా లేకపోవటంతో ఆరు మండలాల్లో అంధకారం అలుముకుంది. సాయంత్రం వరకూ ప్రశాంతంగా ఉన్న వాతావరణంగా, ఒక్కసారిగా మారి గాలుల తీవ్రత పెరిగింది. వర్షం తోడుకావటం, విద్యుత్ సరఫరా లేకపోవటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. **కోడూరు** : మండలంలో గాలులకు చెట్లు విరిగి పడ్డాయి. కోడూరు - రామకృష్ణాపురం రహదారిపై, కోడూరు శివారు స్వతంత్రపురం గ్రామంలో విద్యుత్ వైర్లపై చెట్లు విరిగి పడ్డాయి. దీంతో మండలంలో విద్యుత్ అంతరాయం ఏర్పడింది. వెంటనే రోడ్లపై పడిన చెట్లను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు. **నాగాయలంక** : నాగాయలంక బస్టాండ్‌లో చెట్లు గాలికి విరిగి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌పై పడగా, ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం అయింది. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. ఏఈ జి.వెంకటరాజు తక్షణమే స్పందించి విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులు చేపట్టారు.



ఏటిమొగలో బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ విద్యాసాగర్ నాయుడు

ప్రాణనష్టం జరగకుండా చూడాలి : ఎస్పీ

కోడూరు : తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో ప్రాణ నష్టం జరుగకుండా జాగ్రత్త వహించాలని జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు అన్నారు. తుఫాను నేపథ్యంలో క స్వతంత్రపురం జిల్లా పరిషత్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. 200 కేంద్రాలు ఏర్పాటు చేసి, అన్ని చోట్లా బందోబస్తు ఉంచామని తెలిపారు. బాధితుల ఇళ్ల వద్ద దొంగతనాలు జరుగకుండా పటిష్ట చర్యలు తీసుకుంటామన్నారు. తహసీల్దార్ సౌజన్య కిరణ్మయి, అవనిగడ్డ సీఐ యువకుమార్, కోడూరు ఎస్ఐ చాణిక్య, మెరైన్ ఎస్ఐ పూర్ణ మాధురి, సిబ్బంది పాల్గొన్నారు. **నాగాయలంక** : ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ఏటిమొగలోని పునరావాస కేంద్రాన్ని పరిశీలించి ఏర్పాట్లను పర్యవేక్షించారు. ప్రత్యేకాధికారి, డిఎస్పీ గంగయ్య కూడా ఏటిమొగ పునరావాస కేంద్రాన్ని, శ్రీరామపాదక్షేత్రం ఘాట్‌ను సందర్శించి ప్రజలకు పలు సూచనలు చేశారు.

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

కొత్త తేదీన ఆర్యన్




విష్ణు విశాల్ కథానాయకుడిగా నటించిన 'ఆర్యన్' చిత్రం విడుదల కొత్త తేదీకి మారింది. ముందు ప్రకటించిన విధంగా ఈ నెల 31న ఈ చిత్రం విడుదలవ్వడం లేదు. ఒక వారం ఆలస్యంగా నవంబర్ 7న 'ఆర్యన్' చిత్రాన్ని విడుదల చేయాలని నిర్ణయించుకున్నట్లు విష్ణు విశాల్ తెలిపారు. 'రవితేజ నటించిన 'మాస్ జాతర', 'బాహుబలి: ది ఎపిక్' చిత్రాలు కూడా ఈ నెల 31న విడుదలవుతున్నాయి. రవితేజతో నాకున్న స్నేహం, రాజమౌళిపై గౌరవంతో ఈ నిర్ణయం తీసుకున్నాం' అని ఆయన తెలిపారు. అయితే 'ఆర్యన్' తమిళ వెర్షన్ మాత్రం ఈ నెల 31నే విడుదలవనుంది. ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్‌గా తెరకెక్కిన 'ఆర్యన్' చిత్రానికి ప్రవీణ్ కె దర్శకుడు. శుభ్ర, ఆర్యన్ రమేశ్ నిర్మించారు. శ్రద్ధా శ్రీనాథ్ కథానాయిక. సెల్వ రాఘవన్ కీలకపాత్ర పోషించారు. శ్రేష్ఠ మూవీస్ అధినేత సుధాకర్ రెడ్డి ఈ చిత్రాన్ని తెలుగు రాష్ట్రాల్లో విడుదల చేస్తున్నారు.



అడివి శేష్ కథానాయకుడిగా షానియల్ డియో తెరకెక్కిస్తోన్న రొమాంటిక్ యాక్షన్ థ్రిల్లర్ 'డెకాయిట్'. అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో సుప్రియ యార్లగడ్డ తెలుగు, హిందీ భాషల్లో నిర్మిస్తున్నారు. సునీల్ నారంగ్ సహ నిర్మాత. మొదట డిసెంబరు 25న విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. కానీ కొన్ని అనివార్య కారణాల వల్ల వాయిదా పడింది. తాజాగా మేకర్స్ కొత్త తేదీని ప్రకటించారు. 2026 ఉగాది పండగ సందర్భంగా మార్చి 19న థియేటర్లలోకి రానున్నట్లు తెలిపారు. ఈ మేరకు సంబంధిత పోస్టర్‌ని అడివి శేష్ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. 'ఈసారి మామూలుగా ఉండదు. ముందుకి వెళ్లడమే తప్ప వెనక్కి చూడాల్సిన అవసరమే లేదు' అని క్యాప్షన్ పెట్టారు. కాగా, అడివి శేష్ సరసన కథానాయికగా మృణాల్ ఠాకూర్ నటిస్తున్నారు. బాలీవుడ్ దర్శకుడు, నటుడు అనురాగ్ కశ్యప్ కీలక పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రానికి భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నారు.

శ్రీకాంత్ తివారి వచ్చేస్తున్నాడు



ఓటీటీ ప్లాట్‌ఫామ్‌పై ఓ సరికొత్త ఒరవడిని సృష్టించిన వెబ్ సిరీస్ 'ది ఫ్యామిలీ మ్యాన్'. ఇప్పటి వరకూ రెండు సీజన్లు విజయవంతంగా పూర్తి చేసుకున్న ఈ స్పై యాక్షన్ థ్రిల్లర్ సిరీస్‌లో మూడో భాగం సిద్ధమైంది. మనోజ్ బాజ్‌పాయ్, ప్రియమణి ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సిరీస్‌ను రాజ్ అండ్ డీకే తెరకెక్కించారు. ఈ ప్రాజెక్టును ప్రకటించినప్పటి నుంచి స్ట్రీమింగ్ వివరాల కోసం అభిమానులు ఎంతగానో ఆసక్తిగా ఎదురుచూడ సాగారు. తాజాగా మేకర్స్ స్ట్రీమింగ్ తేదీని ప్రకటించారు. ఆమెజాన్ ప్రైమ్‌లో నవంబరు 21 నుంచి అందుబాటులోకి రానున్నట్లు వెల్లడించారు. దీనికి సంబంధించిన ఓ వీడియోను కూడా షేర్ చేశారు. థ్రెట్ అనాలిసిస్ అండ్ సర్వైవలెన్స్ సెల్(టాస్క్) సీనియర్ ఆఫీసర్ శ్రీకాంత్ తివారి పాత్రలో మనోజ్ బాజ్‌పాయ్ మరోసారి అలరించనున్నారు. రెండు సీజన్లలో మనోజ్ బాజ్‌పాయ్ నటనకు ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు లభించాయి. ఇప్పుడు మూడో భాగంలో ఆయన నటనపై అభిమానుల్లో అంచనాలు పెరిగాయి. తెలుగు, హిందీ, తమిళం, మలయాళం భాషల్లో ఈ సిరీస్ అందుబాటులో ఉంటుంది.

నటులకూ ఎనిమిది గంటల షిఫ్ట్ కావాలి

దేశవ్యాప్తంగా సినీ రంగంలో చర్చనీయాంశమైన పనివేళల అంశంపై కథానాయిక రష్మిక మందన్న స్పందించారు. వరుస పాన్ ఇండియా చిత్రాలతో బిజీగా ఉన్న రష్మిక తాను కూడా అధిక పని ఒత్తిడిని అనుభవిస్తున్నట్లు అంగీకరించారు. 'ది గర్ల్‌ఫ్రెండ్' చిత్రం ప్రచార కార్యక్రమాల్లో భాగంగా ఆమె మాట్లాడుతూ... రోజుకు పది పన్నెండు గంటలకు మించి పనిచేయడం ఎంత కష్టమో, కుటుంబ, వ్యక్తిగత జీవితానికి సమయం కేటాయించడం ఎంత అవసరమో ఆమె వివరించారు. 'నేను కూడా ఎక్కువగంటలు పనిచేస్తున్నాను. ఇది ఆరోగ్యానికి మంచిది కాదు. ఇలా చేయవద్దని అందరికీ చెబుతున్నాను. ఆఫీసులో ఉద్యోగులకు ఉన్నట్లే నటీనటులకూ ఎనిమిది గంటల షిఫ్ట్ ఉండాలి' అని రష్మిక అభిప్రాయపడ్డారు. ఒక షెడ్యూల్ పెట్టుకోని రోజుకు 8 గంటలు కంటి నిండా నిద్రపోవాలి, వృత్తిని వ్యక్తిగత జీవితాన్ని బేలన్స్ చేసుకోవాలని ఆమె సూచించారు. నిర్ణీత పనివేళల డిమాండ్‌తో దీపికా పదుకొనే కొన్ని సినిమాల నుంచి వైదొలగిన్పటి నుంచి పలువురు ఈ అంశంపై భిన్నాభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు.



చట్టమా? విశ్వాసమా?



యామీ గౌతమ్, ఇమ్రాన్ హష్మీ ప్రధాన పాత్రలు పోషించిన చిత్రం 'హక్'. ముస్లిం మహిళల హక్కుల పోరాటంలో మైలురాయిగా నిలిచిన 'మొహమ్మద్ అహ్మద్ ఖాన్ వర్సెస్ షా బానో బేగం' కేసు ఆధారంగా రాసుకున్న కథతో దర్శకుడు సుపర్ణ్ వర్మ ఎస్ తెరకెక్కించారు. నవంబర్ 7న ఈచిత్రం విడుదలవుతోంది. హర్మాన్ బవేజా, విశాల్ గుర్నాని నిర్మించారు. మేకర్స్ మంగళవారం ట్రైలర్‌ను విడుదల చేశారు. చట్టం, విశ్వాసం, న్యాయం మధ్య సంఘర్షణ ప్రధానాంశంగా దర్శకుడు కథను మలచిన తీరు ఆకట్టుకుంటోంది. షాబోనో బేగం పాత్రలో యామీ గౌతమ్, ఆమె భర్తగా ఇమ్రాన్ హష్మీ తమదైన శైలిలో నటించి మెప్పించారు.

నా కోసం ఆ వెన్నెల



ప్రేమలోని విభిన్న కోణాలను ఆవిష్కరిస్తూ తెరకెక్కిస్తోన్న చిత్రం 'ఓ చెలియా'. నాగప్రణవ్, కావేరి కర్ణిక, ఆద్య రెడ్డి ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. ఇందిరా దేవి ప్రొడక్షన్స్ పతాకంపై రూపాశ్రీ కొపురు నిర్మిస్తున్నారు. ఎం. నాగ రాజశేఖర్‌రెడ్డి దర్శకుడు. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. 'నా కోసం ఆ వెన్నెల' అంటూ సాగే ప్రేమగీతాన్ని నటుడు జేడీ చక్రవర్తి చేతుల మీదుగా మేకర్స్ విడుదల చేశారు. హీరో హీరోయిన్ల అనుబంధాన్ని వివరిస్తూ సాగే ఈ గీతానికి శివ సాహిత్యం అందించగా, ఎం.ఎం కుమార్ స్వరపరిచారు. మేఘన, మనోజ్ ఆలపించారు.

రెహమాన్ సంగీత విభావరి

ప్రముఖ సంగీత దర్శకుడు ఏ.ఆర్.రెహమాన్ తన సంగీత విభావరితో మరోసారి హైదరాబాద్ ప్రేక్షకులను అలరించబోతున్నారు. 'హైదరాబాద్ టాకీస్' ఆధ్వర్యంలో నవంబరు 8న రామోజీ ఫిలిం సిటీలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా తెలుగు ప్రేక్షకులతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేస్తూ 'తెలుగు సినిమాలు చేస్తూనే పెరిగాను. 'ఏ మాయ చేశావే' మొదలు ఇటీవల రామ్ చరణ్ సినిమా వరకు ఇక్కడి ప్రేక్షకులు నన్ను ఎంతగానో ఆదరించారు. ఇప్పుడు హైదరాబాద్ ప్రజలు నా కచేరీని గొప్పగా ఆస్వాదిస్తారని భావిస్తున్నా.' అని అన్నారు. కచేరీలో తన బాణీల గురించి వివరిస్తూ 'నాకు పాత స్వరాలను అనుసరించే సమయం లేదు. కొత్త అనుభూతి కోసం 'రోజా' లాంటి క్లాసిక్స్‌ని డాల్బీ అట్మోస్‌లో రీమిక్స్ చేస్తున్నాను. ఇప్పుడు సంగీతం గ్లోబల్ అయిపోయింది. ఎవరు ఏ భాషలో ఆస్వాదిస్తున్నారో ఎవరూ చెప్పలేరు. సంగీతంలో కొత్తదనం, స్పష్టత ముఖ్యం. అది ప్రేరేపించే భావోద్వేగం అన్నింటి కంటే మరీ ముఖ్యం' అని వివరించారు. కాగా, 2017లో హైదరాబాద్‌లో నిర్వహించిన ఓ భారీ కచేరీలో రెహమాన్ ప్రేక్షకులను 'మా తుజే సలామ్' పాటతో ఉర్రూతలూగించారు. మళ్లీ ఇన్నేళ్లకు సంగీత ప్రియులను అలరించబోతున్నారు.



కొండాలమ్మకు ప్రత్యేక పూజలు

గుడ్లవల్లేరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : వేమవరం కొండాలమ్మ అమ్మ వారి ఆలయ 17వ వార్షికోత్సవ వేడుకలు మంగవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి అభిషేకాలు,అర్చనలు, వివిధరకాల పుష్పాలతో అర్చనలు నిర్వహించారు. ఆలయ ఈవో కొండలరావు దంపతులు, ధర్మకర్తల మండలి చైర్మన్ ఈడే వెంకట విష్ణుమోహనరావు దంపతులు, ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు తూము రాజ్యలక్ష్మి,కళ్లేపల్లి సుగుణశేఖర్, వడ్లమూడి రవీంద్రబాబు, డీసీ చైర్మన్ మల్లి పెద్ది సుబ్రహ్మణ్యచౌదరి, వడ్లమన్నాడు జనసేన నాయకులు పెన్నేరు నాగవెంకట లీలా శేఖర్, గుడ్లవల్లేరు పీఏసీఎస్ చైర్మన్ యెనిగళ్ల నాగేశ్వరరావు పాల్గొన్నారు.


కొండాలమ్మ అమ్మవారికి పూజలు చేస్తున్న నిర్వాహకులు

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

● డీఎల్‌డీవో సునీత


గుడివాడలో బాధితులతో మాట్లాడుతున్న రావి

పెదపారుపూడి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తుఫాను నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి ప్రాణనష్టం లేకుండా చూసుకోవాలని డీఎల్‌డీవో సునీత అన్నారు. మంగళవారం పెదపారుపూడిలోని జడ్పీ హైస్కూల్‌లోని పునరావాస కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా సునీత మాట్లాడుతూ గ్రామపంచాయతీ కార్యదర్శులు అన్ని ప్రభుత్వ శాఖల అధికారులతో తుఫాను ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని తెలిపారు. రేకుల షెడ్డులు, గుడిసెలు శిథిలావస్థలో ఉన్న గృహాల్లో నివసించే వారిని పునరావాస కేంద్రాలకు తరలించాలన్నారు. వారికి కావాల్సిన అన్ని ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ఎంపీడీవో


లింగవరంలో పునరావాస కేంద్రానికి తరలిస్తున్న పోలీసు సిబ్బంది

విమాదేవి, డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాస్, ఏవో విజయ్ కుమార్, వీఆర్వో రాజాబాబు, అంగన్వాడీ సూపర్‌వైజర్ అరుణ కుమారి, వాణి, సూపర్‌వైజర్లు శేఖర్ పాల్గొన్నారు.

పెదపారుపూడి : పునరావాస కేంద్రాల్లో ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా చూడాలని టీడీపీ మండల అధ్యక్షుడు చలసాని రమేష్ చౌదరి అన్నారు. మంగళవారం వెంట్రప్రగడలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పునరావాస కేంద్రంలో భోజనం ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు. 26 కుటుంబాలు, 78 మంది పార్టీ తరఫునుంచి ఎటువంటి సహాయ సహకారాలు కావాలన్నా అందిస్తామన్నారు. తహసీల్దార్ శ్రీను నాయక్, రీ సర్వేయర్ సుందర్‌రావు, మండల ప్రధాన కార్యదర్శి రాంబాబు, చిలకా ఆంజనేయులు, కార్యదర్శి సాగర్ రాణి, వీఆర్వో ఫణి కుమార్ పాల్గొన్నారు.

గుడివాడ రూరల్ : తుఫాను పరిస్థితిని ఎదుర్కొవటానికి పోలీసు శాఖ సిబ్బంది అందుబాటులో ఉందని ఎస్సై చంటిబాబు తెలిపారు. లింగవరంలో ఉన్న యూపీ పాఠశాలలో ఉన్న 60 మంది బాధితులను గుడివాడకు తరలించారు. వారికి మెరుగైన సౌకర్యం కల్పించేందుకు తహసీల్దార్ కిరణ్ ఆధ్వర్యంలో గుడివాడ తరలించామని తెలిపారు.


గుడ్లవల్లేరులో..

కూచిపూడి : పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం పొందుతున్న వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ లింగమనేని రామలింగేశ్వరరావు సూచించారు. మండల పరిధిలోని చినముత్తేవి, పెదపూడి, కోసూరు, మొవ్వ, భట్లపెనుమర్రు, కాజ, నిడుమోలు కేంద్రాలను మంగళవారం ఆయన పరిశీలించి నిర్వాసితులకు భోజనాలు వడ్డించి కేంద్రంలో అందుతున్న వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ ఏడు కేంద్రాల్లో 500 మంది ఆశ్రయం పొందుతున్నట్లు తహసీల్దార్ కె.మస్తాన్ తెలిపారు. పునరావాస కేంద్రాలను ఎంపీడీవో సుహాసిని, కూటమి నేతలు తాతినేని పూర్ణచంద్రరావు, వీరంకి తులసీదాస్, దేవినేని రమేష్, ఈడే నాగేశ్వరరావు తదితరులు పరిశీలించారు.

కూచిపూడి: తుఫాను ప్రభావం కారణంగా తీవ్రమైన గాలులకు పలు గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు, వృక్షాలు నేలకొరిగాయి. విద్యుత్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. కాజ, భట్లపెనుమర్రుల్లో కొబ్బరిచెట్లు విరిగి విద్యుత్ తీగలపై పడటంతో స్తంభాలు విరిగిపోయి వైర్లు తెగిపోయాయి. పెదపూడిలో వృక్షం విరిగిపడిపోయింది. మంత్రిపాలెం శివారు మాకులవారిపాలెంలో చెట్లు విరిగి విద్యుత్ తీగలపై పడటంతో వైర్లు తెగిపోయాయి.


మోటూరులో పీహెచ్‌సీలో..

ఎవరూ భయపడొద్దు

గుడివాడరూరల్, అక్టోబరు28 (ఆంధ్రజ్యోతి): తుఫాను తాకిడికి ఎవరు భయపడవద్దని, ప్రభుత్వం అప్రమత్తంగా ఉందని, గుడివాడ రూరల్ మండల ప్రత్యేకాదికారిణి సరళ కుమారి అన్నారు. మంగళవారం మోటూరు గురుకుల పాఠశాల, మోటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలకు కావాల్సిన సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. తుఫాను సమయంలో పాములు, తేళ్లు మనుష్యులను కరుస్తుంటాయని, పాముకాటుకు మందు పీహెచ్‌సీలో ఉందని తెలిపారు. డ్రెయినేజీ, విద్యుత్ తదితర అంశాలను సిబ్బందితో వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎంపీడీవో విష్ణు ప్రసాద్, డీఎల్‌డీవో సునీత శర్మ పాల్గొన్నారు. లింగవరంలో మంగళవారం కాలనీలోకి వెళ్లి మహిళలతో మాట్లాడారు. ప్రతీ కుటుంబం నిత్యావసర వస్తువులు సిద్ధం చేసుకోవాలన్నారు

పామర్రు: మొంథా తుఫాన్ ప్రభావంతో మండలంలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి.జిల్లా పరిషత్ హైస్కూల్లో ఏర్పాటు చేసిన తుఫాను పునరావస కేంద్రంలో వసతి పొందుతున్న దాదాపు 224 మందికి రెవెన్యూ పంచాయతీ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో చిన్నారులకు పాలు, రొట్టెలు, భోజనాలు వంటి సదుపాయాలు కల్పించారు. పునరావాస కేందాన్ని గ్రామ సర్పంచి కేతావతు కస్తూరి, జనసేన నియోజకవర్గ ఇన్చార్జి తాటిచెట్టి నరేష్, ఎమ్మెల్యే సోదరుడు వర్ల చైతన్య, కృష్ణ డెల్టా ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ వల్లూరుపల్లి గణేష్, పామర్రు మండల ప్రత్యేక అధికారి జిల్లా హౌసింగ్ ఈ వెంకట్రావు పరిశీలించారు. స్థానిక ఫైర్ స్టేషన్ సమీపంలో సంచార జాతులను గుర్తించి వారిని హుటాహుటిన అధికారులు పునరావాస కేంద్రానికి తరలించారు. తహసీల్దార్ జి. రవికాంత్ సీఐ సుభాకర్ ఎస్సై రాజేంద్రప్రసాద్ ఎంపీడీవో జ్యోతి కార్యదర్శి సలీం పాల్గొన్నారు

పమిడిముక్కల : మండల పరిధి పునరావాస కేంద్రాలను కూటమి నాయకులు, ఉద్యోగులు మంగళవారం పరిశీ లించారు. మండలపరిధిలో 17 పునరావాస కేంద్రాలు ఏర్పా టు చేసి అధికారులు మొంథా తుపానుకు ఇబ్బంది పడ కుండా పూరిపాకలు, రోడ్ల పక్క గుడిసెల్లో నివసించేవారిని కేంద్రాలకు తరలించారు. తాడంకి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల పునరా వాస కేంద్రాన్ని టీడీపీ నాయకులు జక్కా శ్రీనివాసరావు తదితరులు సందర్శించి భోజన ఏర్పాట్లు పరిశీలించారు. కేంద్రంలో గురజాడకు చెందిన 150మంది గిరిజనులతో మాట్లాడి వసతులు గురించి ఆరాతీశారు.

నందివాడ : మొంథా తుఫాను ముందస్తు చర్యలలో భాగంగా మండలంలోని ఐదు చోట్ల జనార్థనపురం, నందివాడ, తమిరిశ, వెన్ననపూడి, రుద్రపాక గ్రామాల్లో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు మండల పరిషత్ అధికారి మల్లేశ్వరి తెలిపారు. జనార్థనపురం పునరావాస కేంద్రంలో 120 మంది, నందివాడ 81 మంది, తమిరిశ 20 మంది, వెన్ననపూడి 52 మంది, రుద్రపాక 30 మంది పునరావాస కేంద్రాలలో ఉన్నట్లు ఆమె తెలిపారు.

గుడ్లవల్లేరు: మొంథా తుఫాన్ ప్రభావంతో మంగళవారం గుడ్లవల్లేరు మండలంలో రోజంతా వర్షం, ఈదురుగాలు వీచాయి. వడ్లమన్నాడులో చెట్లు విరిగి రహదారిపై పడ్డాయి. పంచాయతీ సిబ్బంది విరిగిన చెట్లను తొలగించారు. కౌతవరం పునరావాస కేంద్రంలో 47 మంది. వడ్లమన్నాడు కేంద్రంలో ఇద్దరు, అంగలూరులో 21 మంది,డోకిపర్రులో 10 మంది నిర్వాసితులు ఉన్నారని ఎంపీడీవో ఇమ్రాన్ చెప్పారు. పునరావాస కేంద్రాల్లో విద్యుత్ జనరేటర్లు ఏర్పాటు చేశారు. ప్రత్యేకాధికారి జిల్లా బీసీ సంక్షేమాధికారి జి.రమేష్ ఆధ్వర్యంలో అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

గుడివాడ : మొంథా తుసాన్ దెబ్బకు గుడివాడ నియోజకవర్గం అతలాకుతమైంది. ముఖ్యంగా విద్యుత్ స్తంభాలు విరిగిపడటంతో విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడింది. గుడివాడ - విజయవాడ ప్రధాన అర్హతలు స్థానిక అక్కినేని నాగేశ్వరావు కళాశాల వద్ద చెట్టు నేలకొరిగింది. దీంతో రోడ్డుకి ఇరువైపులా ట్రాఫిక్ భారీ స్థాయిలో నిలిచిపోయింది. పెదపారుపూడి మండలం వానపాముల


ఏఎస్‌ఆర్ కళాశాల వద్ద కూలిన చెట్టు

వద్ద చెట్టు కొమ్మలు విరిగి మీద పడటంతో ఇద్దరు ద్విచక్ర వాహనదారులు గాయాల పాలయ్యారు. విషయం తెలుసుకొని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రావి వెంకటేశ్వరావు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. పట్నంలోని ఫ్లై ఓవర్ బ్రిడ్జి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి వద్ద రెండు వృక్షాలు నేలకూలడంతో గుడివాడ విపత్తు స్పందన అగ్నిమాపక శాఖ బృందాలు వాటిని తొలగించాయి. గుడివాడ మండలం మల్లాయపాలెం శివారు కొత్త మల్లాయపాలెంలో చెట్టు కూలడంతో రేకుల షెడ్డు పూర్తిగా ధ్వంసం అయింది. ఈ సంఘటనలో ఎవరికి గాయాలు అవలేదు. గుడ్లవల్లేరు మండలం జేమ్స్


మొవ్వలో నిర్వాసితులకు భోజనం వడ్డిస్తున్న లింగమనేని రామలింగేశ్వరరావు

పేట గ్రామం వద్ద ముదినేపల్లి ప్రధాన రహదారి, డోకిపర్రులో చెట్లు విరిగిపడ్డాయి. డోకిపర్రులోని తుఫాను పునరావాస కేంద్రం దగ్గర విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో అధికారులు హుటాహుటిన జనరేటర్ ను ఏర్పాటు చేశారు. గుడివాడ- ముదినేపల్లి రహదారిలో పలుచోట్ల చెట్లు నేలకొరిగాయి. స్థానికుల సహాయంతో గుడివాడ రూరల్ పోలీసులు వాటిని తొలగించారు. గుడివాడ మండలం బిళ్ళపాడు మెయిన్ రోడ్ లోని వాటర్ ప్లాంట్ దగ్గర భారీ వృక్షం నేలకొరిగింది. పట్టణంలో కూటమి నాయకులు స్థానిక ధనియాలపేట , పంచవటి కాలనీలో పర్యటించి కాలువలు, డ్రైన్లలో ఖాళీ స్థలాల్లో ఎక్కడ నీరు నిలిచిపోకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. నియోజకవర్గ పరిధిలో ఎక్కడికక్కడ విద్యుత్ స్థంబాలు విరిగి పడటంతో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం వాటిల్లింది. విద్యుత్ శాఖ అధికారులు పునరుద్ధరణ చర్యలు చేపడుతున్నారు.


పమిడిముక్కలలో..

తోట్లవల్లూరులో ఏడు పునరావాస కేంద్రాల ఏర్పాటు


బాధితులకు ఆహారం వడ్డిస్తున్న గురుమూర్తి

తోట్లవల్లూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : తోట్లవల్లూరు మండలంలో మొంథా తుఫానుకు మంగళవారం ఏడు పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు తహసీల్దార్ ఎం కుసుమకుమారి తెలిపారు. తోట్లవల్లూరు కేంద్రంలో 90 మంది, భద్రిరాజుపాలెం కేంద్రంలో 10 మంది, దేవరపల్లి కేంద్రంలో 44 మంది, కుమ్మమూరు కేంద్రంలో 60 మంది, గరికపర్రు కేంద్రంలో 90 మంది, బొడ్డపాడు కేంద్రంలో 44 మంది, గుర్విందపల్లి కేంద్రంలో 10 మంది నుంచి చొప్పున తుఫాను బాధితులకు ఆశ్రయం కల్పించి అల్పాహారంతో పాటు ఆహారం అందజేశామని తహసీల్దార్ తెలిపారు. రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి అన్ని పునరావాస కేంద్రాలను సందర్శించి వసతి ఏర్పాట్లను పరిశీలించారు. ఉయ్యూరుకు చెందిన ఈడే అంజిబాబు, దావు ఏడుకొండలు 50, తోట్లవల్లూరు జనసేన మండల అధ్యక్షుడు ఎస్ కృష్ణసుమన్ 50 మొత్తం 100 దుప్పట్లను వితరణగా ఇవ్వగా గురుమూర్తి చేతుల మీదుగా బాధితులకు అందజేశారు. అలాగే అన్ని కేంద్రాల్లో బిస్కెట్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఎంపీటీసీ సభ్యుడు నర్రా వెంకట అప్పారావు, టీడీపీ నాయకులు ఉప్పులూరి గోపాలకృష్ణ, వల్లూరు రాంబాబు తదితర నాయకులు గురుమూర్తి వెంట పాల్గొన్నారు. మండల ప్రత్యేకాధికారి రాఘవేంద్రరావు తహసీల్దార్ కార్యాలయంలో తుఫాను సహాయ చర్యలను సమీక్షించారు. ఎంపీడీవో రవికాంత్ పలువురు అధికారులు, సహాయ చర్యల్లో పాల్గొన్నారు.

వరి కోతలను వాయిదా వేసుకోవాలి


రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయాధికారి సూరపనేని కవిత

గుడివాడ రూరల్: రైతులకు ఇప్పటి వరకు ఎలాంటి నష్టం లేదని ఏడీఏ సూరపనేని కవిత అన్నారు. మంగళవారం రామన్నపూడి ఆర్ఎస్‌కేలో రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమ వీఏఏలు ప్రతీ రోజు తుఫాన్ పంట నష్టం అంచనాకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. రైతులు అన్ని రకాలుగా సిద్ధంగా ఉండాలని, కోతలు కోయకుండా వాయిదా వేయాలని తెలిపారు. బీపీటీ రకం రామన్నపూడి, తట్టివర్రు గ్రామాల్లో కోతలకు సిద్ధంగా ఉన్నప్పటికీ వాయిదా వేసుకోవాలన్నారు. పొలాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. ఒక వేళ వరి పంట నేలకొరిగినా ఇబ్బంది ఉండదని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారిణి బోలెం అనంతలక్ష్మీ, రామన్నపూడి పీఏసీఎస్ అధ్యక్షులు సూరపనేని రామకృష్ణ, రామన్నపూడి మాజీ సర్పంచ్ మసిముక్కు గోపాలకృష్ణ, వీఏఏలు పాల్గొన్నారు.

ప్రజలకు వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలి

గుడివాడ రూరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండల ప్రజలకు వైద్యసిబ్బంది అందుబాటులో ఉండటానికి కృషి చేస్తున్నట్లు వైద్యాధికారి దీప్తి తెలిపారు. మంగళవారం 104 వాహనంలో బొమ్ములూరు, రామన్నపూడి, గంగాధరపురం తదితర ప్రాంతాల్లో వైద్య శిబిరం నిర్వహించారు. మండలంలో గర్భిణులు ఎంత మంది ఉన్నది వివరాలు సేకరించి వారిని ప్రత్యేకంగా తరలించామన్నారు. బాలింతలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా జాగ్రత్తలు తీసుకున్నామని తెలిపారు. ప్రతీ సబ్ సెంటర్‌లో తగిన మందులు అందుబాటులో ఉంచామని తెలిపారు. ఎటువంటి ఇబ్బందులు కలిగిన తమ సిబ్బంది అందుబాటులో ఉండి ప్రజలకు సేవలందిస్తామని తెలిపారు. మోటూరు పీహెచ్‌సీలో అన్ని రకాలుగా రోగులకు సేవలందిస్తున్నట్లు తెలిపారు. కుక్క కాటుకు, పాముకాటుకు అన్ని రకాల మందులు ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు. ఈ వైద్యశిబిరంలో 150 మంది రోగులకు పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు.

ముమ్మరంగా డ్రెయిన్లలో పూడికతీత పనులు

గుడ్లవల్లేరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ ప్రభావంతో రెండురోజులుగా కురుస్తున్న వర్షం ప్రభావంతో వడ్లమన్నాడులోని వడ్లమన్నాడు మేజర్ డ్రెయిన్ పొంగి ప్రవహిస్తోంది. ఆ కారణంగా డ్రెయిన్ సమీపంలోని వరిచేలు ముంపునకు గురయ్యాయి. డ్రెయిన్లలో తామరాకులు, డ్రెయిన్ అడుగు భాగంలో కర్రనాచు పట్టడంతో డ్రెయిన్ పొంగుతుంది. అయితే డ్రెయినేజి శాఖ అధికారులు డీసీ చైర్మన్ సుబ్రమణ్యేశ్వరచౌదరిలు యుద్ధ ప్రాతిపదికన డ్రెయిన్లలో నాచు తొలగించే ప్రయత్నాలు ప్రారంభించారు.

నందివాడ : తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో మండవల్లి డీసీ చైర్మన్ పాలడుగు నానారావు ఆధ్వర్యంలో గుడివాడ ఛానల్ (దొండపాడు కాలువ)లో తూడు, గుర్రపు డెక్క పేరుకుపోయి క్రిందికి నీళ్ల వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ముందస్తు చర్యల్లో భాగంగా డీసీ చైర్మన్ నానారావు తన సొంత ఖర్చుతో మంగళవారం తమిరిశ శివారు అంకన్నగూడెం వంతెన వద్ద రెండు ప్రొక్లెయినర్లతో ఇరిగేషన్ అధికారులు ఈఈ ఆంజనేయ ప్రసాద్ ఆధ్వర్యంలో గుర్రపు డెక్క తొలగింపు పనులు చేపట్టినట్లు ఏఈ బేగ్ తెలిపారు. ఈ సందర్భంగా నానారావు మాట్లాడుతూ మొంథా తుఫాన్ తీవ్ర ప్రభావం కాలువల ద్వారా నీళ్ల వెళ్లకపోతే లోతట్టు ప్రాంతాలు మునిగిపోతాయన్న ఉద్దేశ్యంతో ఈ కాలువ గుర్ర పు డెక్క పనులు ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పాలడుగు ధర్మపాల్, శ్రీనివాసరావు, రాయుడు, ఇరిగేషన్ డీఈ భరత్ పాల్గొన్నారు.


వడ్లమన్నాడులో పొంగుతూ పారుతున్న వడ్లమన్నాడు మేజర్ డ్రెయిన్


కూచిపూడిలో నేలకొరిగిన వరి పైరు

ఆందోళనలో అన్నదాతలు

కూచిపూడి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తుఫాను ప్రభావం కారణంగా వర్షంతోపాటు మంగళవారం గాలులు తోడు కావటంతో పలు గ్రామాల్లో వరి చేలు నేలకొరిగాయి. కూచిపూడి, బార్లపూడి, పెదపూడి, మొవ్వ తదితర గ్రామాల్లో వరి చేలు నేలకొర గటంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. మరో రెండు, మూడు రోజులపాటు విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో కంకుల్లోకి నీరు చేరి గింజ గట్టిబడకుండా తప్పలుగా మారే అవకాశం ఉందని రైతులు వాపోతున్నారు. వేలాది రూపాయలు వెచ్చించి చే తికందివచ్చిన పంట మరో 15 రోజుల్లో కోతకు వస్తున్న తరుణంలో తుఫాను రైతుల ఆశలపై నీళ్లు చల్లి తీవ్ర నష్టం మిగిల్చింది.


మొంథా తుఫాను ముందస్తు సన్నాహాలు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

ముందస్తు చర్యలకు సిద్ధం

గుడివాడ, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి) : మొంథా తుపాను నేపథ్యంలో గుడివాడ విపత్తు సంస్థ, అగ్నిమాపక శాఖ ముందస్తు సన్నాహాలు చేపట్టింది. మంగళవారం స్థానిక అగ్నిమాపక శాఖ కార్యాలయంలో అసిస్టెంట్ జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి ఆంజనేయులు నేతృత్వంలో సన్నాహక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొంథా తుఫాను నేపథ్యంలో ప్రజలకు అత్యవసర సేవలను అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. సోషల్ మీడియాలో వచ్చే నకిలీ పోస్టులను నమ్మవద్దన్నారు. సమస్యలు తలెత్తితే ప్రభుత్వ టోల్‌ఫ్రీ నెంబర్లకు సమాచారం అందించాలన్నారు. అత్యవసర వేళల్లో వెలుగును అందించే అస్కా లైటింగ్ యంత్రాలను అధికారులు పరీక్షించారని వివరించారు. అవసరమైన యంత్ర, సహాయక పనిముట్లను బృందాల వారీగా సిబ్బందిని సిద్ధం చేసుకున్నామన్నారు. తుఫాను సమీపిస్తున్న వేళ ప్రజలకు సహాయంగా గుడివాడలో 8 బృందాలను సిద్ధం చేశామన్నారు. ఈ బృందాలు ప్రజలకు తక్షణ సహాయం అందించేందుకు సర్వసన్నద్ధంగా ఉన్నాయన్నారు. సమాచారం అందిస్తే వేగవంతంగా ఘటనా స్థలానికి చేరుకునేలా సిద్ధంగా ఉన్నట్లు ఆంజనేయులు పేర్కొన్నారు.

మూడు రోజుల ముందుగానే నవంబర్ రేషన్


రేషన్ దుకాణం నుంచి బియ్యం తీసుకెళుతున్న ప్రజలు


తోట్లవల్లూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుపాను అతాలకుతలం చేస్తుండటంతో ప్రజలకు నవంబర్ నెల రేషన్ సరుకులను ప్రభుత్వ ఆదేశాలతో మూడు రోజుల ముందుగానే పంపిణీ చేస్తున్నారు. మంగళవారం రేషన్ దుకాణాల నుండి బియ్యం, పంచదారను ప్రజలు తీసుకెళుతున్నారు. అక్టోబర్ రేషన్ బియ్యం ప్రజల దగ్గర అయిపోవటంతో నెల చివర్లో నవంబర్ నెల బియ్యం ఇవ్వటం తమను ఆదుకున్నట్లయిందని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మంటాడ రోడ్డుకు మోక్షమెన్నడో ..!

● వాహనదారులకు తప్పని సర్కస్‌ఫీట్లు
● పట్టించుకోని అధికారులు

(పమిడిముక్కల - ఆంధ్రజ్యోతి): మంటాడ-ఉయ్యూరు ఆర్అండ్‌బీ రోడ్డు పూర్తిగా ధ్వంసమై గోతులతో నిండిపోయింది. దీంతో వాహనదారులు రాకపోకల సమయాల్లో సర్కస్‌ఫీట్లు చేయక తప్పడం లేదు. మంటాడ వెంకటేశ్వరస్వామి ఆలయం సమీపం నుంచి ఉయ్యూరు కేసీపీ కర్మాగారం వరకు రోడ్డుపొడవునా చిన్న పెద్ద గుంత లు ఏర్పడి సంవత్సరాల తరబడి మరమ్మతులకు నోచుకోలేదు. దీంతో ఈ రోడ్డుపై వెళ్లాలంటే భయపడాల్సి వస్తోందని వాహనదారులు వాపోతున్నారు. మండలంలోని గ్రామాల నుంచి ప్రజలు ఉయ్యూరు వెళ్లేందుకు నిత్యం ఇదే రోడ్డు ఉపయోగిస్తుంటారు. ఈ పరిస్థితుల్లో ద్విచక్రవాహనం సైతం నడపలేక మంటాడనుంచి కిలోమీటరు దూరాన ఉన్న ఉయ్యూరుకు నాలుగు కిలోమీటర్ల దూరం చుట్టూ తిరిగి హైవేపై వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో సమయంతో పాటు, ఇందనం వృధా అవుతుందని వాహనదారులు వాపోతున్నారు. పామర్రు నుంచి ఉయ్యూరు వ చ్చే ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాలు గుంతల్లో పడి మొరాయించి నిలిచిపోతున్నాయి. దీంతో బస్సుల్లో ఉండే ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. ధ్వంసమైన రహదారికి మరమ్మతులు చేపట్టాలని అధికారులు, ప్రజాప్రతినిధులకు మొరపెట్టుకున్నా పట్టించుకున్నవారు లేరని ప్రయాణికులు వాపోతున్నారు.


గోతుల్లో నిలిచిన వర్షపునీరు


గోతులతో నిండిన మంటాడ- ఉయ్యూరు ఆర్అండ్‌బీ రహదారి

బ్రాయిలర్ ధరలు	
అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	140, 149, 160
చికెన్ విత్ స్కిన్	270
చికెన్ స్కిన్‌లెస్	280
నెక్ కోడిగుడ్డు ధర (100)	
విజయవాడ జోన్ రైతు ధర రూ. 575	

శివాలయాల్లో విశేష పూజలు

చల్లపల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : కార్తీకమాసం సందర్భంగా శివాలయాల్లో విశేషపూజలు, అభిషేకాలు జరుగుతున్నాయి. మహిమాన్విత శైవక్షేత్రం నడకుదురు శ్రీపృధ్వీశ్వరస్వామి దేవాలయం, చల్లపల్లి, లక్ష్మీపురం, పాగోలు గ్రామాల్లోని ఆలయాల్లో మంగళవారం శివునికి అభిషేకాలు చేసి అలంకరణలు చేశారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. లక్ష్మీపురంలో శ్రీదుర్గా పార్వతీసమేత సోమేశ్వరస్వామి వారికి చేసిన విశేష అలంకరణ భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది.


లక్ష్మీపురం సోమేశ్వరస్వామి


పెదప్రోలు శిబిరంలో బాధితులకు భోజనం వడ్డిస్తున్న కూటమి నాయకులు


చల్లపల్లిలో పునరావాస కేంద్రంలోని వారిని పరామర్శిస్తున్న మండలి వెంకట్రామ్


ముంజులూరు పునరావాస కేంద్రంలో దుప్పట్ల పంపిణీ చేస్తున్న టీడీపీ మండల అధ్యక్షుడు వీరబాబు


గణపేశ్వరంలో పునరావాస కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్

అండగా ఉంటాం.. అన్ని విధాల ఆదుకుంటాం

• మంత్రి కొల్లు రవీంద్ర


సుందరయ్యనగర్‌లో ముంపునకు గురైన ప్రాంతాలను పరిశీలిస్తున్న మంత్రి రవీంద్ర, ఇతర అధికారులు

మచిలీపట్నం టౌన్ , అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాను వలన ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుంటుందని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. మంగళవారం ఉదయం మచిలీపట్నం మండలంలోని సుల్తానగరం గోల్డ్ కన్వెన్షన్ హాల్ , 50వ డివిజన్లోని నారాయణపురంలోనీ తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు. అక్కడ మోటార్లతో మురికి కాలువలోని నీటిని పక్కనున్న చెరువులోకి తోడే కార్యక్రమాన్ని మంత్రి పరిశీలించారు. సుల్తానగరంలో మంత్రి మురుగు నీటి వ్యవస్థను పరి శీలించారు. అనంతరం 50వ డివిజన్ నారాయణపురంలోనీ వార్డు సచివాలయంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్నీ అక్కడే పై భవనంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని మంత్రి పరిశీలించారు. మంత్రి డివిజన్లోని వీధులన్నీ కాలినడకన వర్షపు నీటిలోనే తిరిగి అక్కడి ప్రజల కష్టసుఖాలను అడిగి తెలుసుకున్నారు. డివిజన్లో మురికి కాలువలు వర్షపు నీటితో నిండిపోయి పొంగి రోడ్డుపైన నిలిచిపోవడం మంత్రి గమనించారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు మాట్లాడుతూ రహదారి ఎత్తు తగ్గడంతో వర్షపు నీరు ఇండ్లలోకి వస్తుందని, మోకాటి లోతులో నీరు ఉందని, పిల్లలు జ్వరాలు జబ్బులతో చాలా ఇబ్బంది పడుతున్నామని, కొందరు ఇల్లు మంజూరు చేయాలని మంత్రి దృష్టికి తీసుకుని వచ్చారు. ఈ సందర్భంగా మంత్రి వెంటనే స్పందిస్తూ వారు ఎలాగున్నారు అని తెలుసుకోవడానికి తాను వచ్చానని అంటూ వారి ఇబ్బందులను తొలగించే ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

అనంతరం మంత్రి మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ మచిలీపట్నం నగరంలోని 40, 42, 50 డివిజన్లో, శివగంగ ప్రాంతంలో వర్షపు నీరు నిలిచి ప్రజలు కొంత ఇబ్బంది పడుతున్నారు. వర్షపు నీటిని తోడేందుకు మోటార్లను ఏర్పాటు చేసి బయటకు దూరంగా మళ్ళిస్తున్నామన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా మచిలీపట్నం నియోజకవర్గంలో 18 సహాయక శిబిరాలను ఏర్పాటు చేశామన్నారు. అందులో దక్షిణంలో 11, ఉత్తరంలో 7 సురక్షిత పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఇంకా అవసరమైతే అదనంగా పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు.

ఆ కేంద్రాల్లో మంచినీరు, మరుగుదొడ్లు తదితర మౌలిక సదుపాయాలతో పాటు వారికి కావలసిన మంచి ఆహారం అందిస్తున్నామన్నారు. ప్రస్తుతం 13 కోట్ల రూపాయలతో మురికినీటి వ్యవస్థను బాగుపరుస్తున్నామని మరో 60 కోట్ల రూపాయలు కూడా మురుగునీటి వ్యవస్థ మెరుగుపరిచేందుకు ఖర్చు చేస్తున్నామన్నారు. మచిలీపట్నం నగరంలో మురుగునీటి సమస్య లేకుండా శాశ్వతంగా పరిష్కరించేందుకు ప్రజారోగ్య శాఖ ద్వారా అన్ని విధాల చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ పర్యటనలో మంత్రి వెంట మచిలీపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుంచె నాని, తహసిల్దారు మధుసూదన్ రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్, స్థానిక నాయకులు ఇలియాస్ బాషా, వెంకటస్వామి, వెంకన్న తదితర అధికారులు అనధికారులు పాల్గొన్నారు.


గోపాల్ నగర్‌లోని లోతట్టు ప్రాంతాల్లో నీటిని మోటార్ల సాయంతో తోడిస్తున్న కమిషనర్ బాపిరాజు

మచిలీపట్నం టౌన్ , అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫానును సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాల సిద్ధంగా ఉందని జిల్లా ఇన్చార్జి మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. మంగళవారం ఉదయం జిల్లా ఇన్చార్జి మంత్రి, మం త్రి కొల్లు రవీంద్ర, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావుతో కలిసి మచిలీపట్నం మండలంలోని తాళ్లపాలెం పంచాయతీ గిరిపురంలో మండల పరిషత్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని సందర్శించి అక్కడి ఏర్పాట్లను పరిశీలించారు. అక్కడి ప్రజలతో అందరూ బాగున్నారా అని వారు విచారించారు. అనంతరం మంగినపూడి బీచ్‌ను సందర్శించి అక్కడ ఎగిసిపడుతున్న అలలను, బలమైన ఈదురుగాలులను పరిశీలించారు. ఈ పర్యటనలో మంత్రులు వెంట మచిలీపట్నం డివిజన్ ఇంచార్జ్ గృహ నిర్మాణ సంస్థ జిల్లా అధికారి పోతురాజు, మచిలీపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుంచె నాని, ఎంపీడీవో వెంకటేశు, తహసీల్దార్ నాగభూషణం మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వర రావు, తదితరులు పాల్గొన్నారు.


అవనిగడ్డలో పునరావాస కేంద్రంలో బాధితులతో మాట్లాడుతున్న పోలీస్ అధికారులు


బంటుమిల్లి పునరావాస కేంద్రాన్ని పరిశీలించిన ప్రత్యేక అధికారి చంద్రశేఖరరెడ్డి, తహసీల్దార్ పూర్ణచంద్రరావు

మేము సైతం

చల్లపల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : చల్లపల్లి జడ్పీహైస్కూల్, లక్ష్మీపురం పాఠశాలలో ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రాలను ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావులు సం దర్శించారు. శిబిరంలో ఆశ్రయం పొందుతున్న వారిని పరామర్శించి సౌక ర్యాలపై వివరాలడిగి తెలుసుకున్నారు. తుఫాను తగ్గేవరకు శిబిరాల్లోనే ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా చల్లపల్లి జడ్పీహైస్కూల్‌లో ఆశ్రయం పొందుతున్న 30 మందికి ఏఎంసీ చైర్మన్ తోట కనకదుర్గ ఆధ్వర్యంలో ఆహార పొట్లాలను తుఫాన్ బాధితులకు ఎమ్మెల్యే, ఆర్టీసీ చైర్మన్‌లు అందచేశారు. మంగళాపురం, మాజేరు తదితర గ్రామాల్లోనూ పునరావాస శిబిరాలను ఏర్పాటు చేశారు. యువనేత మండలి వెంకట్రామ్, మండల ప్రత్యేకాధికారి ఆర్‌సి.ఆనందకుమార్, తహసీల్దార్ డి.వనజాక్షి, ఎంపీపీ కోట విజయరాధిక, సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, మండల టీడీపీ అధ్యక్షుడు మోర్ల రాంబాబు, డీసీ చైర్మన్ నిడమానూరి దిలీప్‌కుమార్, కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

కోడూరు: తుఫాన్ నేపథ్యంలో కోడూరు మండల పరిధిలోని తీర ప్రాంత గ్రామాల ప్రజల రక్షణ కోసం ఏర్పాటు చేసిన పునరావాస శిబిరాల వద్ద కూటమి నేతలు విశేష సేవలు అందిస్తున్నారు. వి.కొత్తపాలెం, స్వతంత్రపురం శిబిరాల వద్ద బిస్కెట్ ప్యాకెట్ల పంపిణీ, మధ్యాహ్న భోజనం వడ్డించే కార్యక్రమాల్లో పాల్గొని తమవంతు సేవలు అందిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ అగ్నికుల క్షత్రియ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ చైర్మన్ చిలకలపూడి పాపారావు, ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, డీసీ చైర్మన్ దేవనోయిన వెంకటేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షులు బండే శ్రీనివాసరావు, మర్రె గంగయ్య, పీఏసీఎస్ అధ్యక్షులు, పాల్గొన్నారు.

అవనిగడ్డ రూరల్ : మండల పరిధిలోని పులిగడ్డ పునరావాస కేంద్రంలో ఆశ్రయం పొందుతున్న బాధితులను గ్రామీణ యువజన వికాస సమితి అధ్యక్షులు మండలి వెంకట్రామ్ (రాజా) మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తుఫాన్ తగ్గే వరకు పునరావాస కేంద్రాల్లోనే ఉండాలని, ఇందుకు అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మరియ కుమారి తదితరులు పాల్గొన్నారు. పులిగడ్డలోని పునరావాస కేంద్రాన్ని ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు పరామర్శించారు. మాజీ ఎంపీపీ బండే కనకదుర్గ, టీడీపీ నాయకులు పరుచూరి దుర్గా ప్రసాద్, కమ్మిలి సుబ్రహ్మణ్యం, బండే రామవ, గ్రామ పార్టీ అధ్యక్షులు మండలి దయాకర్, వినయ్, చెన్ను బాబురావు పాల్గొన్నారు.

నాగాయలంక: మొంథా తుఫాను పునరావాస కేంద్రాలను నిర్వహించేందుకు ప్రభుత్వం ముందుగా నిధు లను విడుదల చేయటంతో బాధితులకు భోజనాలు సక్రమంగా నిర్వహిస్తున్నారని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. మంగళవారం గుల్లలమోద, ఏటిమొగ, సొర్లగొంది, గణపేశ్వరం గ్రామాల్లోని పునరావాస కేంద్రాలను ఎమ్మెల్యే సందర్శించారు. బాధితులకు వసతి, భోజనాల సదుపాయాలను ఆరా తీసి సంతృప్తిని వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ మురుగు కాల్వలలో పూడిక తీయటంతో వరి పంట ముంపు బారిన పడలేదన్నారు. మండలంలోని అవుట్ పాల్ స్లూయిస్ పునర్నిర్మాణానికి 50 కోట్లతో ప్రతిపాదనలు పంపామన్నారు. తుఫాన్ తగ్గాక ఆయా శాఖల అధికారులు నష్టాలపై తగు అంచనాలు తయారు చేయాలని ఆయన ఆదేశించారు. తహసీల్దార్ వీరాంజనేయ ప్రసాద్, స్వర్ణలత పాల్గొన్నారు.

నాగాయలంక: తుఫాన్ పునరావాస కేంద్రాలను మండలంలో 11 గ్రామా ఏర్పాటు చేసి 1094 మది ప్రజలకు టిఫిన్, భోజన వసతిని కల్పిస్తున్నట్లు తహసీల్దార్ సిహెచ్.వీరాంజనేయ ప్రసాద్ తెలిపారు. సంగమేశ్వరం, నాలి, బీల్ గ్రాహం నగర్, గణపేశ్వరం, సొర్లగొంది, ఏటిమొగ, గుల్లలమోద, ఎదురుమొండి, గొల్ల మంద, నాచుగుంట, ఈలచెట్లదిబ్బ గ్రామాల్లో ఏర్పాటు చేశాదమన్నారు.

మోపిదేవి: మొంథా తుఫాను నేపథ్యంలో మండలంలోని ఆయా గ్రామాల్లో పల్లపు ప్రాంతాలలో ఉన్న 1083 మందిని పునరావాస కేంద్రాలకు తరలించటం జరిగింది. మోపిదేవి మండలంలోని 13 గ్రామపంచాయతీలో ఏర్పాటు చేసిన కేంద్రాలలో బాధితులు సురక్షితంగా తరలించినట్లు మండల ప్రత్యేకాధికారి హాజీ బేగ్ తెలిపారు. మంగళవారం ఉదయం తహసీల్దార్ హరనాథ్, ఎంపిడివో స్వర్ణ భారతి, ఎంపీపీ రావి దుర్గావాణిలతో కలసి మండల ప్రత్యేకాధికారి ఆయా గ్రామాల్లో ఉన్న కేంద్రాలను సందర్శించి బాధితులు పొందుతున్న సౌకర్యాలు, వసతులు పరిశీలించారు.

బంటుమిల్లి : తుఫాను నేపథ్యంలో మండలంలో పెందుర్రు, బంటుమిల్లి, కనకదుర్గ టెంపుల్ ప్రాంత వాసులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ప్రత్యేక అధికారి చంద్రశేఖరరెడ్డి అధికారులకు సూచించారు. తహసీల్దార్ పూర్ణ చంద్రరావుతో కలిసి పలు ప్రాంతాలను పరిశీలించి వారితో మాట్లాడి పునరావాస కేంద్రాలకు తరలించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ శంకర్, పంచాయితీ కార్యదర్శి దాసరి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

బంటుమిల్లి: ముంజులూరు జిల్లా పరిషత్ హైస్కూల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో తలదాచుకుంటున్న బాధితులకు దుప్పట్లు పంపిణీ చేశారు. టీడీపీ మండల అధ్యక్షులు కూనపరెడ్డి వీరబాబు ఆధ్వర్యంలో ఎల్ఎస్ఆర్ ఫౌండేషన్ సహాయ నిధితో దాదాపు 100 దుప్పట్లు పంపిణీ చేశారు.

పెడన రూరల్: మొంథా తుఫాన్ కారణంగా గ్రామాల్లో ఈదురుగాలుల వలన అనేక చోట్ల చెట్లు విరిగి నేలకొరిగాయి. విద్యుత్ స్తంభాలపై పడి తీగలు తెగాయి. లంకల లకలవగుంట, కాకర్లమూడి, నందమూరు గ్రామాల్లో చెట్లు రోడ్డుకు అడ్డంగా పడగా అధికారులు వాటిని తొలగించారు. తాహసీల్దార్ కె అనిల్‌కుమార్, ఎంపీడీవో అరుణకుమారి, నాగిరెడ్డి, మండల వ్యవసాయాధిరారిణి సజ్జా జెస్సీ, గ్రామాలలో పర్యటిస్తు ప్రజలను అప్రమత్తం చేశారు.


ఆలయ సూపరింటెండెంట్ మధుసూదనరావుకు చెక్కు అందిస్తున్న దాతలు

నిత్యాన్నదాన పథకానికి రూ.50 వేలు విరాళం

మోపిదేవి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మోపిదేవిలోని శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి దేవాలయంలో జరిగే నిత్యాన్నదాన పథకానికి దాతలు విరాళాన్ని అందజేశారు. హైదరాబాద్ బాచుపల్లి వాస్తవ్యులు వి.వంశీకృష్ణ - మమతా దంపతులు తమ చిన్నారి దేవాన్ష్ పేరుమీదగా రూ.50 వేలు విరాళం ఆలయ సూపరింటెండెంట్ మధుసూదనరావుకు అందజేశారు. ఈ సందర్భంగా దాతలను ఘనంగా సత్కరించారు.


పెదగొల్లపాలెంలో దుప్పట్లు, కూరగాయలు అందిస్తున్న అంగర రంగనాథ్

బాధితులకు సాయం

కృత్తివెన్ను, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాను ప్రభావంతో ఇబ్బందులు పడుతున్న తీరప్రాంత గ్రామాల ప్రజలకు బీసీ కో ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ అంగర రంగనాథ్ మంగళవారం తన సాయంను అందించారు. మండలంలో తీరప్రాంత గ్రామాల్లో పర్యటించి, వృద్ధులకు, నిరాశ్రయులకు దుప్పట్లు, కాయగూరలు అందించారు. నిడమర్రు సర్పంచ్ బస్వాని బంగార్రాజు తీరప్రాంత వాసులకు ఆహారం అందించారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.


చల్లపల్లిలో చెట్టును తొలగిస్తున్న రెడ్‌క్రాస్ వలంటీర్లు

రెడ్‌క్రాస్ వలంటీర్ల సేవలు

చల్లపల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : తుఫాను ప్రభావంతో గ్రామాల్లో చెట్లు విరిగిపడటంతో రెడ్‌క్రాస్ వాలంటీర్లు సేవలందించారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కృష్ణాజిల్లా చైర్మన్ డాక్టర్ డిఆర్‌కె.ప్రసాద్ పర్యవేక్షణలో స్వచ్ఛ కార్యకర్తలు, రెడ్‌క్రాస్ వాలంటీర్లు మంగళవారం సాయంత్రం సేవలందించారు. పద్మావతి హాస్పటల్ బజారులో 30 ఏళ్ల క్రితం నాటిన చెట్టు నేలవాలింది. స్థానిక దళితవాడలో బాలికల హాస్టల్ వద్ద భారీ చెట్టు విరిగి రోడ్డుకు అడ్డంగా పడగా యంత్రాలు, కత్తుల సహాయంతో రాకపోకలకు అడ్డంగా పడిన చెట్లను తొలగించి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చేశారు.

చల్లపల్లిలో ఈదురుగాలులు .. భయాందోళనలో ప్రజలు

చల్లపల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : తుఫాను ప్రభావం మంగళవారం చల్లపల్లి మండలంలో ప్రజలను భయభ్రాంతులకు గురిచేసింది. ఉదయం నుంచి పలుమార్లు వర్షం కురియగా, మధ్యాహ్నం తుఫాను ప్రభావం కనిపించింది. మూడు గంటల నుంచీ బలమైన ఈదురుగాలులు వీయగా, మధ్యలో వర్షం కురుస్తూ ఉంది. గాలుల తీవ్రతకు పలు ప్రాంతాల్లో చెట్లు నేలవాలాయి. ఒకటిరెండు చోట్ల విద్యుత్‌స్తంభాలు విరిగిపడ్డాయి. ప్రధాన రహదారులపై చెట్లు విరి గిపడ్డాయి. తాటిచెట్ల ఎండుటాకులు, మట్టలు రాలి విద్యుత్‌స్తంభాలపైనా, రోడ్లపైనా పడ్డాయి. కొబ్బరిచెట్లు, భారీవృక్షాలు హోరు శబ్దం చేస్తూ ఊగుతూ ఉండగా, సముద్రతీరాన్ని తలపించేలా గాలిశబ్దం ప్రజలను భయభ్రాంతులను చేసింది. గాలుల నేపథ్యంలో రైతాంగం తీవ్ర ఆందోళన చెందుతున్నారు. చల్లపల్లి మండల పరిధిలోని మేకవారిపాలెం, రాముడుపాలెం తదితర ప్రాంతాల్లో అక్కడక్కడా వరిపైరు నేలవాలగా, వరి కంకులు తయారుచేసిన పొలాలు గాలులకు ఊగుతున్నాయి.


చల్లపల్లి మండలం రాముడుపాలెం పుష్కరఘాట్ వద్ద కృష్ణానదిలో ఎగిసిపడుతున్న అలలు


చల్లపల్లి మండలం రాముడుపాలెంలో నేలవాలిన వరిపైరు

కోడూరులో నేలకొరిగిన వరి పంట

కోడూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు, ఈదురుగాలులకు పంట పొలాలు నేలకొరగటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. లింగారెడ్డిపాలెం, నరసింహాపురం, నక్కవానిదారి, ఐబి. పేట, జయపురం, కృష్ణాపురం గ్రామాలలో ఈత దశలో ఉన్న వరి పైరు విరిగిపోయాయి. పంట చేతికి వచ్చే దశలో తీవ్రంగా నష్టపోతామని రైతులు వాపోతున్నారు.